



# తొలిరోజు 16 నామినేషన్లు




శ్రీకాళహస్తిలో నామినేషన్ వేసేందుకు ఊరేగింపుగా వస్తున్న టీడీపీ అభ్యర్థి సుధీర్ రెడ్డి

### తిరుపతి ఎంపీకి ఒకటి... ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు 15దాఖలు.... గూడూరుకు నిల్

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తొలిరోజే తిరుపతి జిల్లాలో 16మంది నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి, ఆరు అసెంబ్లీ స్థానాలకు 15 చొప్పున దాఖలయ్యాయి. 16 మంది అభ్యర్థులు మొత్తంగా 21సెట్ల నామినేషన్లు సమర్పించారు. తిరుపతి పార్లమెంటు స్థానానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ తిరుపతిలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఎదుట నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.తిరుపతి అసెంబ్లీకి ఏడుగురు అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీకాళహస్తి నుంచీ ముగ్గురు ఐదు సెట్ల నామినేషన్లు వేశారు. సత్యవేడుకు రెండు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి స్థానాలకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. గూడూరు అసెంబ్లీ స్థానానికి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా వేయలేదు.



చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీ నామినేషన్

#### చంద్రగిరి, శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు

చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి పులివర్తి వెంకట మణిప్రసాద్ అలియాస్ పులివర్తి నానీ నామినేషన్ దాఖలు చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రానికి ఆయన తన సతీమణి సుధారెడ్డితో కలసి వాహనంలో వెళ్ళారు. పోలీసులు కార్యాలయ ఆవరణలోకి వాహనాన్ని అనుమతించలేదు. సుధారెడ్డి కాలికి గాయమైనందున నడవలేనని చెప్పడంతో తర్వాత వాహనాన్ని అనుమతించారు. గాయంతో నడవలేని స్థితిలో నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు వచ్చిన తమను వాహనం అడ్డుకుని ఇబ్బంది పెట్టడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ మీడియాకు చెప్పారు. కాగా శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అట్టహాసంగా వేలాదిమంది కార్యకర్తలు, అనుచరులతో ఊరేగింపుగా వెళ్ళి నామినేషన్ వేశారు. ఆయన రెండు సెట్లు, ఆయన సతీమణి బొజ్జల రిషిత రెండు సెట్లు చొప్పున నామినేషన్లు వేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి రావడం, బాణాసంచా భారీ ఎత్తున పేల్చడంతో పట్టణమంతా సందడి నెలకొంది. నామినేషన్ దాఖలు చేసిన సమయంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు ఆయన వెంట వున్నారు. భారత చైతన్య యువజన పార్టీ తరపున దినద్ బాబు నామినేషన్ దాఖలు చేశారు.

#### నాలుగు సెగ్మెంట్లలో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు

తిరుపతిలో వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు వేయగా మరో ఆరుగురు ఇండిపెండెంట్లుగా నామినేషన్ పత్రాలు సమర్పించారు.సూళ్ళూరుపేటలో వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య నామినేషన్ వేశారు. వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఆయన తల్లి రాజ్యలక్ష్మి ఆర్వోకు సమర్పించారు. సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ తరపున ఆయన సతీమణి చైతన్య భాను నామినేషన్ వేశారు.ఆ సందర్భంగా రాజేశ్ నామినేషన్ కేంద్రం వెలుపలే వున్నారు. అక్కడే కాంగ్రెస్ అభ్యర్థిగా బాలగురవం బాబు కూడా నామినేషన్ పత్రాలు అందజేశారు.

### నామినేషన్ల స్వీకరణా? స్క్రూట్నీయా?

● రెండు గంటలపాటు ఆర్వో కార్యాలయంలోనే వైసీపీ అభ్యర్థి

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హోదాలో కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పిన అరగంటలోనే నిబంధనలు తుంగలో తొక్కారన్న విమర్శలు వచ్చాయి.వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డి గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మేయర్ డాక్టర్ శిరీష,డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.ఆర్వో అదితిసింగ్ నామినేషన్లు స్వీకరించి, సూత్రప్రాయంగా పరిశీలించి అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపాల్సి ఉంటుంది.ఆమె అలా చేయకుండా రెండు గంటలు పాటు అభ్యర్థిని,ఆయనతో వచ్చినవారిని కార్యాలయంలో కూర్చోబెట్టుకుని నామినేషన్ దరఖాస్తును ఆసాంతం పరిశీలించినట్టు తెలుస్తోంది.గంట పాటు ఆమె పరిశీలించాక ఏఆర్వోగా ఉన్న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు ఇచ్చినట్టు తెలిసింది. ఆయన మరో గంట నామినేషన్ పత్రాలను పరిశీలించి అంతా 'ఓకే' అన్న తర్వాత అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపారు. పక్కనేవున్న ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని తన భార్య సుధారెడ్డితో కలసివచ్చి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కేవలం పదినిమిషాల్లోనే ఈ తంతును పూర్తిచేశారు. అయితే అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు గంటలు గడుస్తున్నా లోపలివారు బయటకు రాకపోవడం చర్చగా మారింది.ఈనెల 26న నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది.అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించి, నిబంధనలకు లోబడి ఉన్నవాటిని పోటీ జాబితాలో పొందుపరుస్తారు. అందుకే కొందరు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లను దాఖలు చేస్తుంటారు.మరి తిరుపతి ఆర్వోవ్యవహరించిన తీరుపై నామినేషన్ల తొలిరోజే విమర్శలు రావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.కాగా అభినయ్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు వేయగా అతని స్నేహితులు పెంచల ప్రసాద్, ఆర్.కృష్ణ చైతన్య, బండ్ల చంద్రశేఖర్, బ్యాంగి నవీన్, సోమశేఖర్ రెడ్డి, శేఖర్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఏజెంట్ ఫారాలు, బూత్ ఏజెంట్ల కోసమే ఈ ఆరుగురితో నామినేషన్లు వేయించారన్న ఆరోపణలొచ్చాయి.

## ఎన్నికల నోటిఫికేషన్ జారీ

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీ ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.వచ్చే నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని ఆ రోజు, మరుసటి రోజు జిల్లావ్యాప్తంగా సీఆర్‌పీసీ 144వ సెక్షన్ అమలు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. 13వ తేదీ పోలింగ్ వుంటుందని, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగి రీపోలింగ్ అనివార్యమైతే మరుసటి రోజైన 14వ తేదీ నిర్వహించాల్సి వుంటుందన్నారు. దానికోసం ఆ రెండు తేదీల్లో 144వ సెక్షన్ అమల్లో వుంటుందన్నారు.

#### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను 25న నిర్ణయిస్తాం : కలెక్టర్

ఎన్నికల కమిషన్ నియమించిన జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు 25వ తేదీన వచ్చాక జిల్లా ఎన్నికల చరిత్రను పరిశీలిస్తారన్నారు.ఆర్వో సమావేశమై సమీక్షించాక ఏయే పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమో నిర్ణయిస్తారని వివరించారు.ఆయా కేంద్రాల్లో అదనపు పోలీసు బందోబస్తుతో పాటు వెబ్ కాస్టింగ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

#### మే 2-8 నడుమ పోస్టల్ బ్యాలెట్ల సేకరణ

జిల్లాలోని సర్వీసు ఓటర్లకు మే నెల 2వ తేదీ నుంచీ 8వ తేదీ నడుమ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 30వేలమంది సర్వీసు ఓటర్లు వున్నారన్నారు. వారి కోసం ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.అక్కడినుంచీ బ్యాలెట్ పత్రాలు తీసుకుని 8వ తేదీ లోపు ఫెసిలిటేషన్ సెంటర్లలో అందజేయవచ్చునని వివరించారు.

#### చంద్రగిరికి అదనంగా మరో ఆర్వో

చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం తిరుపతి జిల్లాలో వున్నప్పటికీ అది చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ఎన్నికల అధికారిగా ఆ నియోజకవర్గంలో పోలింగ్, కౌంటింగ్‌లకు తానే బాధ్యుడినన్నారు. అలాగే అసెంబ్లీ సెగ్మెంట్ ఫలితాలు కూడా తామే ప్రకటిస్తామన్నారు. అయితే ఆ సెగ్మెంట్‌కు సంబంధించి ఎంపీ ఓట్ల లెక్కింపు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంతో ముడిపడి వున్నందున ఇక్కడి రౌండ్ వారీ ఫలితాలను చిత్తూరు కలెక్టర్‌కు తెలియజేస్తామని, వారు మిగిలిన సెగ్మెంట్లతో కలుపుకుని రౌండ్ల వారీ ఫలితాలను ప్రకటిస్తారని వివరించారు. ఓట్ల లెక్కింపు ఇక్కడే నిర్వహిస్తున్నప్పటికీ ఈ అదనపు పని కోసం ప్రత్యేకంగా ఆ నియోజకవర్గానికి కౌంటింగ్ సందర్భంలో అదనంగా మరో రిటర్నింగ్ అధికారిని నియమిస్తామన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని సర్వేపల్లి సెగ్మెంట్ సైతం ఈ జిల్లా పరిధిలో కాకుండా నెల్లూరు జిల్లా పరిధిలో వుందని గుర్తు చేశారు. ఆ సెగ్మెంట్ ఎంపీ ఫలితాలను రౌండ్ వారీ నెల్లూరు జిల్లా నుంచీ తెలుసుకుని ఇక్కడి సెగ్మెంట్ల ఓట్లతో కలుపుకుని రౌండ్ వారీ ప్రకటించాల్సి వుంటుందన్నారు.మీడియా సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ కూడా పాల్గొన్నారు.

## ధాన్యం ధరల పతనం

● బ్రోకర్ల సిండికేట్ దెబ్బకు తీర ప్రాంత రైతు విలవిల



కోట, ఏప్రిల్ 18: ఈ ఏడాది మొదట్లో ఆశాజనకంగా వుండిన ధాన్యం ధరలు బ్రోకర్ల సిండికేట్ దెబ్బతో పతనమయ్యాయి. రెండు నెలల వ్యవధిలో ధాన్యం బ్రోకర్లు సిండికేట్‌గా మారి బయటి రాష్ట్రాల్లో ధరలు బాగున్నప్పటికీ మిల్లర్లు ధాన్యాన్ని అడగడం లేదంటూ చేతులెత్తేశారు. ధాన్యం ధరలు పడిపోయాయని ప్రచారం సాగించారు.సముద్రతీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రైతులు ఎక్కువభాగం బీపీటీ 5204 (పెద్దజిలకర), నెల్లూరు జిలకర్లు, 1010 ధాన్యాన్ని సాగు చేస్తున్నారు.కోతలు చివరి దశకు చేరుకోవడంతో పాటు దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఆనందంగా వున్న రైతులు ధాన్యం ధరలు పడిపోయాయంటూ ప్రచారం ఊపందుకోవడంతో హతాశులయ్యారు.మొదట్లో రూ.23,500 పలికిన బీపీటీ 5204 రకం ప్రస్తుతం రూ.21 వేలకు పడిపోయింది. ఆ రేటుకు కూడా ధాన్యం అడిగే నాథుడేలేడని బ్రోకర్లు ప్రచారం చేస్తున్నారు.మొన్నటి వరకు నెల్లూరు జిలకర్లు రూ.17వేలకు పైగా పుట్టి ధాన్యం పలుకుతుండగా, ప్రస్తుతం రూ.15వేలు మాత్రమే ఇస్తామంటున్నారు.1010 రకం ధాన్యం పుట్టి రూ.17,200 పలుకుతుండగా ప్రస్తుతం రూ.15వేలకు కూడా అడిగే నాథుడే లేకుండా పోయారని రైతులు వాపోతున్నారు. చెన్నైలోని రెడ్‌హిల్స్, కర్ణాటకలోని తుంకూరు ప్రాంతాల్లో ధాన్యానికి మంచి ధర వున్నప్పటికీ రైతుల వద్ద ధాన్యం నిల్వలను ఆసరాగా చేసుకొని బ్రోకర్లు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేశారు. కోట, చిట్టమూరు మండలాల్లో ధాన్యం కోతలు జరుగుతూనే ఉండగా కొన్ని గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం నిల్వలున్నాయి. ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతులు చేసేదిలేక నిల్వ ఉన్న ధాన్యాన్ని అందినకాడికి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది దిగుబడులు బాగుండడం...మంచి ధరలు పలకడం చూసి ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు.

## రేపు గూడూరుకు చంద్రబాబు

● సాయంత్రం సత్యవేడులో బహిరంగసభ

● 29న తిరుపతికి పవన్ కళ్యాణ్

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 20న, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 29న జిల్లాకు రానున్నారు. శనివారం ఉదయం చంద్రబాబు గూడూరు చేరుకుంటారు. అక్కడ ఆర్టీసీ బస్టేషన్ సమీపంలోని సీఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో మహిళలతో ముఖాముఖీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం గూడూరు నుంచీ నెల్లూరు జిల్లా సర్వేపల్లి వెళ్ళి అక్కడ జరిగే బహిరంగసభకు హాజరవుతారు. అక్కడి నుంచీ సాయంత్రం తిరిగి సత్యవేడుకు చేరుకుని బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారు. గూడూరులో అదే రోజు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ నామినేషన్ కార్యక్రమం వున్నప్పటికీ చంద్రబాబు పర్యటన కోసం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. కాగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈనెల 29న తిరుపతిలో పర్యటించనున్నారు. ఆ రోజు మొత్తం ఆయన తిరుపతిలోనే గడుపుతారని సమాచారం. నగరంలోని ప్రధాన మార్గాల్లో రోడ్ షో వుంటుందని తెలిసింది. బహిరంగసభ నిర్వహిస్తారా లేక రోడ్‌షోలోనే ప్రధాన కూడళ్ళలో ప్రసంగిస్తారా అన్నది ఇంకా ఖరారు కాలేదు.

## చిత్తూరు జిల్లాలో 15 నామినేషన్లు

● కుప్పం, పూతలపట్టుల్లో నిల్



నగరిలో భారీ ర్యాలీగా నామినేషన్ వేయడానికి వస్తున్న టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18:చిత్తూరు జిల్లాలో తొలిరోజైన గురువారం చిత్తూరు పార్లమెంటు స్థానానికి 1, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాలకు బోణీ కాలేదు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి టీడీపీ తరపున దగ్గుమళ్ల ప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు.పుంగనూరు స్థానానికి టీడీపీ తరపున చల్లా రామచంద్రారెడ్డి, చల్లా పూజారెడ్డి, కాంగ్రెస్ నుంచి జి.మురళీమోహన్, సోషియల్ డెమోక్రటిక్ పార్టీ నుంచి ఖాన్దాది షేక్ అన్వర్ బాషా నామినేషన్ దాఖలు చేశారు.నగరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి జి.భానుప్రకాష్ భారీ జన సందోహంతో తరలివచ్చి నామినేషన్ వేశారు.తెలుగుతమ్ముళ్లు స్వచ్ఛందంగా పదివేల మందికి పైగా తరలిరావడంతో నగరి కిక్కిరిసిపోయింది. వినాయకస్వామి ఆలయం నుంచి ర్యాలీగా టవర్‌క్లాక్ మీదుగా తహసీల్దారు కార్యాలయానికి తరలివెళ్లారు. పార్టీ నేత ప్రతాప్ రాజు ప్రతిపాదించగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీరెడ్డిలతో కలిసి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. గంగాధరనెల్లూరుకు టీడీపీ తరపున గాంధీ రత్నవేలు, స్వతంత్ర అభ్యర్థిగా ఉసురుపాటి పద్మనాభం నామినేషన్ దాఖలు చేశారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి మూడు సెట్లు, టీడీపీ అభ్యర్థి జీసీ జగన్ మోహన్ రెండుసెట్ల నామినేషన్ వేశారు. పలమనేరు నియోజకవర్గానికి వైసీపీ తరపున ఎన్.వెంకటేగౌడ, ఎన్.పావని నామినేషన్ దాఖలు చేశారు.

### అడవిలో ఆగని కార్చిచ్చు



తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం పచ్చదనంతో దర్శనమిచ్చే శేషాచల అడవి అగ్నికి ఆహుతవుతోంది. మంగళవారం ఉదయం సానబండరాళ్ల ప్రాంతంలో అడవికి నిప్పంటుకున్న విషయం తెలిసిందే. వేసవికి ఎండిపోయిన ఆకులు, చెట్లు భారీగా ఉన్న క్రమంలో మంటలు క్రమంగా వ్యాప్తి చెందుతూ వస్తున్నాయి. తిరుమలకు దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం, మొదటి ఘాట్‌కు సమీపంలోని అడవిలో మూడ్రోజుల కిందట మొదలైన మంటలు గురువారానికి కూడా అదుపులోకి రాకపోవడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ సిబ్బంది ఎంత శ్రమించినా మంటలు అదుపులోకి రావడం లేదు. ఘాట్ దిశగా వ్యాప్తి చెందుతున్నాయి. మరోవైపు అడవిలోని అనేక వన్యప్రాణుల్లో కొన్ని మంటల నుంచి దూరంగా వెళ్లిపోగా, మరికొన్ని కాలిపోతున్నట్లు సమాచారం. మంటలు వ్యాప్తి చెందుతుండటంతో దట్టమైన పొగ అడవులను కమ్మేస్తోంది. తిరుపతి నగర ప్రజలకు కూడా ఈ పొగ స్పష్టంగా కనిపిస్తోంది. కాగా, మంటల ద్వారా వచ్చిన బూడిద గాల్లో కలిసి.. స్థానికులు నివాసం ఉండే బాలాజీనగర్‌లోని ఇళ్లపై పడుతోంది.



అమ్మవారి మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

### కమనీయం.. కోదండరాముడి కల్యాణం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 18: తిరుపతిలోని కోదండరామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలోని విద్యుత్ అలంకరణల మధ్య వెలుగులీనే వేదికపై అర్చక స్వాములు ఆదిదంపతుల కల్యాణం కమనీయంగా జరిపించారు. అంతకు ముందు ఉదయం కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలనా భవనం నుంచి తలంబ్రాల కోసం ముత్యాలను ఏనుగుపై ఊరేగింపుగా తీసుకువచ్చి కోదండ రామాలయం ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీయరు స్వాములు, వేదపండితులు, డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ఏనుగుపై ముత్యాల తలంబ్రాల ఊరేగింపు

### శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రీరామపట్టాభిషేకం

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిఆలయంలో గురువారం రాత్రి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా జరిగింది. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులకు విశేష సమర్పణ చేపట్టారు. సాయంత్రం ఐదు నుంచి 5.30 గంటల వరకు సహస్రదీపాలంకార సేవ నిర్వహించారు. తర్వాత సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలి చెంత ఉత్సవర్లను వేంచేపు చేసి, అర్చకులు శ్రీరామపట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సుగ్రీవుడు, అంగదుడు ఉత్సవమూర్తులను వేంచేపు చేసి వారితోపాటు ఆంజనేయస్వామికి పుష్పమాలలను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ప్లీజ్.. పార్టీ మారకుండా చూడండి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 18: 'అబబ్బ ఎక్కడున్నారు? ఫలానా పంచాయతీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు ఈరోజు పార్టీని వీడుతున్నట్లు సమాచారం ఉంది. వారు పార్టీ మారకుండా ఏదోవిధంగా సర్ది చెప్పే బాధ్యత తీసుకోండి' తిరుపతి రూరల్ మండలంలోని వైసీపీ ద్వితీయ శ్రేణులకు ఓ ప్రజాప్రతినిధి ఫోను చేసి మరీ ప్రాధేయపడుతున్నారట. చిన్నపిల్లోడు.. ఎన్నికల్లో అన్యాయం జరగకుండా చూడండని కోరుతున్నారట. ఈ మేరకు చంద్రగిరి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరుగుతోంది. నిన్నా మొన్నటి వరకు ఎవరైనా నేత పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నారని చెబితే.. మనం చేయాల్సిందంతా చేశాం.. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ఇకవారిష్టం అంటూ ధీమాతో సమాధానం ఇచ్చేవారట ఆ ప్రజాప్రతినిధి. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అందరికీ ఫోన్లుచేసి సర్దిచెప్పాలంటున్నారు. అన్ని పంచాయతీల్లో రెండువర్గాలను ప్రోత్సహించిన ఆయన.. తీరా ఇప్పుడు అసంతృప్తులను బుజ్జగించే బాధ్యతలు తమను తీసుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందని నేతలు చర్చించుకుంటున్నారు. ఈ ఐదేళ్ల పంచాయతీల్లో మంచి పట్టున్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వక పోగా.. వారి బాగోగులు పట్టించుకోని ప్రజాప్రతినిధి.. ఇప్పుడు ఇలా చెబుతుండడంపై వారంతా పెదవివిరుస్తున్నారు.

## నామినేషన్ వేసిన పులివర్తి నాని

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 18: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పులివర్తి వెంకట మణిప్రసాద్ అలియాస్ నాని తన నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో తన సతీమణి సుధారెడ్డి, మరికొందరితో కలిసి తిరుపతి ఆర్డీవో, చంద్రగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

**సుధారెడ్డిని అడ్డుకున్న పోలీసులు:** నాని నామినేషన్ సందర్భంగా ఆయన సతీమణి సుధారెడ్డి కూడా మరో కారులో వచ్చారు. అయితే గేటువద్ద పోలీసులు సుధారెడ్డి వాహనాన్ని ఆపేసి, నడిచి వెళ్లాలని సూచించారు. తన సతీమణి నడిచే స్థితిలో లేరని, కార్యాలయం ఆవరణలోకి కారును అనుమతించాలని నాని కోరినా పోలీసులు అంగీకరించలేదు. నిబంధనల ప్రకారం దివ్యాంగులు, నడవలేని వారిని వాహనాలతో కార్యాలయం ఆవరణలోకి అనుమతించాలని, లేదంటే ఈసీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. దాంతో పోలీసులు విషయాన్ని పైఅధికారులకు తెలియజేశాక సుధారెడ్డి వాహనాన్ని కార్యాలయ ఆవరణంలోకి అనుమతించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

**ఈసీకి ఫిర్యాదు చేస్తాం:** నామినేషన్ దాఖలు చేశాక నాని మీడియాతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం నడవలేని వారిని వాహనాలతో కార్యాలయం ఆవరణలోకి అనుమతించాలని ఉన్నప్పటికీ పోలీసులు తమను అడ్డుకుని ఇబ్బంది పెట్టారన్నారు. ఈ విషయంపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మంచి రోజు కావడంతో ఓ సెట్ నామినేషన్ వేశామని, 25వ తేదీన అంగరంగ వైభవంగా మరో నామినేషన్ వేస్తామని వెల్లడించారు.

## శానంబట్లలో టీడీపీ ప్రచారం



చంద్రగిరి, ఏప్రిల్ 18: చంద్రగిరి మండలం, శానంబట్ల పంచాయతీలో టీడీపీకి విశేష ఆదరణ లభించింది. గురువారం శానంబట్ల పంచాయతీలో మీఇంటికి మీపులివర్తి నాని, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అత్తూరి తులసేశ్వరరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, కొండూరి ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, దేవేంద్రకుమార్‌రెడ్డి, శంకరయ్య, బీజేపీ నాయకులు వెంకటముని, నరేష్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి సాధ్యం



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న పులివర్తి వినీల్

తిరుపతి రూరల్, ఏప్రిల్ 18: టీడీపీతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని శ్రీనివాసపురంలో గురువారం మీఇంటివద్దకు మీపులివర్తినాని, బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తన సోదరుడు పులివర్తి నానీకి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన సోదరి ధనలక్ష్మి కోరారు. పాడిపేటలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు.

## కూటమి గెలుపే మాదిగల గెలుపు : ఎమ్మార్పీఎస్

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 18: ఎన్డీయే కూటమి గెలుపుపైనే మాదిగల గెలుపు ఆధారపడి ఉంటుందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎమ్మార్పీఎస్ నేత పల్లెపాక నాగరాజ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఉస్తికాయలపెంట పంచాయతీలోని పలు ప్రాంతాల్లో వారు ప్రచారం చేస్తూ.. పులివర్తి నాని గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాయకులు ఆంజనేయులు, లోకేష్, రమేష్, బాబు, దిలీప్, ఓబులేశు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టండి



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న వీజీ శేషాద్రి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై దృష్టి పెట్టాలని అధికారులను ఎన్నికల వ్యయ పరిశీలకురాలు వీజీ శేషాద్రి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లా ఎక్స్పెండేచర్ నోడల్ ఆఫీసర్ చరణ్ రుద్రరాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు చెందిన వ్యయపరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు పాల్గొన్నాయి.

## కమ్మ భవన్ నిర్మాణానికి 21న భూమి పూజ



మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 18: శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సేవా సంఘం (కాస్) ఆధ్వర్యంలో ఈనెల 21న కమ్మ భవన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు పురంధర నాయుడు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. తిరుపతి రూరల్ మండలం పేరూరు సమీపంలోని వకుళ మాత ఆలయ సమీపంలో 176 గదులతో ఈ భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. దాతల సహకారంతో రూ.6 కోట్లతో స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. రూ.36 కోట్లతో భవన నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. నాయకులు వి.జయరామ్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రామచంద్ర నాయుడు, లీలాకృష్ణమ నాయుడు, గోవిందప్ప నాయుడు, చక్రపాణి, ఏపీ నాయుడు పాల్గొన్నారు.

## స్విమ్స్‌తో పద్మావతి వర్సిటీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలతో భారతి, రవికుమార్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18: స్విమ్స్‌తో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. యూనివర్సిటీలోని నర్సింగ్ కాలేజీ - స్విమ్స్ మధ్య బోధన, పరిశోధనల పరంగా పరస్పరం సహకరించుకోనున్నాయి. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై వర్సిటీ వీసీ భారతి, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ సంతకాలు చేశారు. దీంతోపాటు పద్మావతి యూనివర్సిటీలోని ఆరోగ్య కేంద్రం ద్వారా స్విమ్స్ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ రజని, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగాభవాని పాల్గొన్నారు.

### పశువైద్య శిబిరానికి స్పందన

చంద్రగిరి, ఏప్రిల్ 18: చంద్రగిరి మండలం, శానంబట్లలో గురువారం తిరుపతి వెటర్నరీ కళాశాల, ఎస్వీ పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ రవికుమార్, చంద్రగిరి ఏడీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి డివిజనల్ డైరెక్టర్ ఉమామహేశ్వరి, వైద్యులు కీర్తి, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువ పనులు నీకా.. నాకా..?

- వైసీపీ నేతల మధ్య పొత్తు కుదరక రెండేళ్లుగా ఆగిపోయిన వైనం
- ఇబ్బంది పడుతున్న పద్మావతినగర్ వాసులు



పద్మావతినగర్‌లో మురుగునీటి కాలువ

మంగళం, ఏప్రిల్ 18: తిరుపతి శివారు మంగళం పరిధిలో ఉన్న పద్మావతి నగర్‌లోని ఓ మురుగునీటి కాలువ నిర్మాణం పనులు నీకా... నాకా అంటూ ఇద్దరు వైసీపీ నాయకులు పోటీపడ్డారు. వీరి మధ్య పొత్తు కుదరక పోవడంతో రెండేళ్లుగా ఈ నిర్మాణం జరగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. తిరుమలనగర్ నుంచి వచ్చే మురుగునీరు సమీపంలోని చెరువులో కలుస్తుంది. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా 2022లో ఈప్రాంతానికి వచ్చిన తుడా ఛైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెంటనే ఇక్కడ కాలువ నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలువ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తానని కూడా చెప్పారు. అయితే ఈపనుల కోసం ఇద్దరు వైసీపీనేతలు పోటీపడటంతో పనులు అటకెక్కాయి.

## నన్ను గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

### చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



ప్రసంగిస్తున్న పులివర్తి నాని

మంగళం, ఏప్రిల్ 18: చంద్రగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. గురువారం నామినేషన్ పత్రాలు సమర్పించాక నేరుగా మంగళం వద్దకు చేరుకున్నారు. సప్తగిరికాలనీలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి, అక్కడ ప్రసంగించారు. తాను ఎమ్మెల్యే కాగానే ఈ ప్రాంతంలో రోడ్లు, కాలువల నిర్మాణం, మహిళల రక్షణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా దాదాపు 50మంది టీడీపీలో చేరారు. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో తిరిగి మిట్టగాంధీపురం పరిసర ప్రాంతాల్లో కార్యకర్తల కోలాహలం నడుమ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. సప్తగిరికాలనీ పంచాయతీ అధ్యక్షుడు జడారెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు అల్లాబాషా, హరికృష్ణ, కేశవ నారాయణ, మాతయ్య, రెడ్డెమ్మ, శ్రీనివాసయాదవ్, గోపాల్‌యాదవ్, ఏసుపాదం, వెంకటసుబ్బయ్య, గూడూరుమణి, పార్వతమ్మ, సుబ్బుయాదవ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

**గాంధీపురంలో సమస్యలు పరిష్కరిస్తా**

తిరుపతిరూరల్: వైసీపీ పాలనలో తిరుపతిరూరల్ మండలంలోని గాంధీపురం పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని విమర్శించారు. గురువారం గాంధీపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తనకు ఒక అవకాశం ఇస్తే, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యలన్నీ పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.



టీడీపీలో చేరిన యువతతో పులివర్తి నాని

**టీడీపీలోకి వైసీపీ యువత చేరిక:** పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ యువ నేతలు పులివర్తినాని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో భరత్, జాని, నాగరాజు, రాజు, మునిశేఖర్, చక్రి, మోహన్, రాఖి, గురు, పండు, లోకేష్, రేవంత్, మహేష్, నాగరాజు, నవీన్, సాయి, మురళి, రాజు తదితరులు ఉన్నారు.

**మహిళల కష్టాలను తీర్చేందుకే మహాశక్తి**



మహిళలతో పులివర్తి సుధారెడ్డి

మహిళలు కష్టాలను తీర్చడానికే టీడీపీ మహాశక్తి పథకాన్ని ప్రకటించిందని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. తనపల్లె, కుంట్రపాకం పంచాయతీల్లో మహిళలతో గురువారం నిర్వహించిన మహిళాశక్తి అండగా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహాశక్తి పథకాన్ని వివరించారు.

## టీడీపీ ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల నామినేషన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి టీడీపీ తరపున దగ్గుమళ్ల ప్రసాదరావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షన్మోహన్ నామినేషన్ స్వీకరించారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

## శ్రీకాళహస్తిలో ఆర్భాటంగా... మిగిలిన చోట్ల నిశ్శబ్దంగా

### ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ల తీరుతెన్నూ

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో తొలిరోజు నామినేషన్ల దాఖలు భిన్నంగా సాగింది. శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆర్భాటంగా నామినేషన్ దాఖలు చేయగా మిగిలిన చోట్ల ఎలాంటి సందడి లేకుండా నిశ్శబ్దంగా ఈ కార్యక్రమం ముగించారు.సుధీర్‌రెడ్డి గురువారం ఉదయమే ఊరందూరు నుంచీ శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకున్నారు. శ్రీరామనగర్‌లోని వినాయక ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో కలసి అక్కడ నుంచీ ర్యాలీగా బయల్దేరి ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళి నామినేషన్ దాఖలు చేశారు. ఆలయం పక్క వీధిలోనే నామినేషన్ కేంద్రం వున్నప్పటికీ పట్టణమంతా ర్యాలీ నిర్వహించాక ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి రావడం, బాణాసంచా భారీ ఎత్తున పేల్చడంతో పట్టణమంతా సందడి నెలకొంది. నామినేషన్ దాఖలు చేసిన సమయంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు ఆయన వెంట వున్నారు.వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్, సూళ్ళూరుపేటలో వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్, కాంగ్రెస్ అభ్యర్థి బాల గురవం బాబు, తిరుపతిలో వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ కేవలం నలుగురైదుగురితో వెళ్ళి నామినేషన్ పత్రాలను సమర్పించారు. తిరుపతి ఎంపీ స్థానానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ సైతం పెద్దగా హడావిడి లేకుండా నామినేషన్ వేశారు.

**సెంటిమెంట్ పాటించిన పలువురు అభ్యర్థులు**

వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తరపున ఆయన తల్లి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేశ్ తరపున ఆయన సతీమణి చైతన్య భాను నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆ సందర్భంగా రాజేశ్ నామినేషన్ కేంద్రం వెలుపలే వున్నారు. అక్కడే కాంగ్రెస్ అభ్యర్థి బాల గురవం బాబు తమ్ముడు భాస్కర్‌తో కలసి నామినేషన్ వేశారు. చంద్రగిరిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ తన సతీమణి సుధారెడ్డిని వెంటబెట్టుకుని వెళ్ళి నామినేషన్ వేశారు. ఇక శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తన సతీమణి రిషితతో కలసి నామినేషన్ కేంద్రానికి వెళ్ళి ఇరువురూ రెండు సెట్లు చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

### చిత్తూరు డిప్యూటీ మేయర్ కారు షెడ్‌లో

## భారీగా మద్యం స్వాధీనం

- రూ.10లక్షల విలువైన 170 మద్యం కేసుల సీజ్



డిప్యూటీ మేయర్ కారు షెడ్డులో సీజ్ చేసిన మద్యంతో అధికారులు

చిత్తూరు, ఏప్రిల్ 18: చిత్తూరు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డికి చెందిన కారు షెడ్డులో గురువారం ఎస్ఈబీ అధికారులు భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ విజయ్ కుమార్ వివరాల మేరకు... నగరంలోని బాహుజీనగర్ పరిధిలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డికి చెందిన కారు షెడ్డులో కర్ణాటక మద్యం నిల్వ ఉందని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం వచ్చింది. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఒకటవ పట్టణ పోలీసులతో కలసి ఎస్ఈబీ అధికారులు కారు షెడ్డులోని ఆఫీస్‌పై దాడులు చేశారు. రూ.10 లక్షల విలువైన చేసే ఒరిజినల్ చాయిస్ విస్కీ 70 కేసులు, అమృత్ సిల్వర్ కప్ 100 కేసులతో కలిపి మొత్తం 170 కేసుల కర్ణాటక మద్యాన్ని సీజ్ చేశారు. షెడ్డు డిప్యూటీ మేయర్‌దని అక్కడున్న స్వీపర్ చెప్పడంతో కేసు నమోదు చేశారు.

## వైసీపీ నిబంధనల ఉల్లంఘన

### చిత్తూరు కలెక్టరేట్ గేటు తోసుకుంటూ లోనికెళ్లిన పార్టీ శ్రేణులు ● అదుపు చేయలేక చేతులెత్తేసిన పోలీసులు



గేటును తోసుకుంటూ లోనికి వెళుతున్న కారు

చిత్తూరు, ఏప్రిల్ 18: చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి నామినేషన్ దాఖలు ప్రక్రియలో ఆ పార్టీ శ్రేణులు నిబంధనలు ఉల్లంఘించాయి. గురువారం నామినేషన్ దాఖలు చేసేందుకు గంగినేని చెరువు నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. రెండుగంటల పాటు సాగిన ఈ ర్యాలీ మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్దకు చేరుకుంది. లోపలికి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని ఎన్నికల సంఘం నిబంధన ఉన్నా వైసీపీ శ్రేణులు పట్టించుకోలేదు. విజయానందరెడ్డి, ఆయన సతీమణి, కుమారుడు కారులో వచ్చారు. గేటు వద్దనే కారు ఆపి వెళ్లాలని పోలీసులు చెప్పినప్పటికీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు వినిపించుకోకుండా తోసుకుంటూ లోనికి తీసుకెళ్లారు. చేసేది లేక పోలీసులు మిన్నకుండిపోయారు. కాగా, విజయానందరెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా చిత్తూరులోని వీధులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించాయి. ఎంఎస్ఆర్ జంక్షన్ నుంచి వేలూరు వైపు వెళ్లే వాహనాలను అనుమతించలేదు. కలెక్టరేట్, గిరింపేట, రెడ్డిగుంట ప్రాంతాలకు వెళ్లే వారిని ఇరువారం బైపాస్ మీదుగా వెళ్లాలని పోలీసులు సూచించడంతో ఇబ్బందులు పడ్డారు. గంగినేని చెరువు, కొండమిట్ట, గిరింపేట, దుర్గమ్మ ఆలయం వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చడంతో పొగతో స్థానికులు ఇబ్బందిపడ్డారు.

## సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి: ఎస్వీయూ వీసీ



జ్యోతిని వెలిగిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 18: విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. తిరుపతి రూరల్ మండలంలోని సి.గొల్లపల్లెలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని గురువారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్‌ఛైర్మన్ వై.విజయ్‌రెడ్డి, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి, సిద్దార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## చేనేత మన వారసత్వ సంపద



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ భారతి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18: చేనేత వస్త్రాలు మన భారతీయ వారసత్వ సంపదగా పరిగణించాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి అన్నారు. గురువారం ఆ యూనివర్సిటీ బీ ఒకేషనల్ (ఫ్యాషన్ టెక్నాలజీ) విభాగంలో చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేనేత వస్త్రాలు ధరించి వస్త్ర ప్రదర్శన చేపట్టారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు రఫియా సుల్తానా, దేవి, హబీబుల్లా పాల్గొన్నారు.

## రెండు వాహనాల వితరణ



తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18: సమాజంలో సామాజిక సేవలందిస్తున్న సంస్థలకుకార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ40.36 లక్షల విలువైన రెండు వాహనాలను ఎస్బీఐ ఎండీ చల్లా శ్రీనివాసులశెట్టి వితరణ చేశారు. కపిల తీర్థంరోడ్డులోని ఎస్బీఐ శిక్షణ తరగతుల కార్యాలయం వద్ద గురువారం ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు జిల్లా గొల్లపాళెం చైల్డ్ ఆశ్రమం వారికి రూ.12.07 లక్షల వాహనం, కాకినాడకు చెందిన సంకురాత్రి ఫౌండేషన్‌కు రూ.28.29 లక్షల విలువైన మరో వాహనాన్ని అందజేశామన్నారు. ఎస్బీఐ అధికారులు నవీచంద్రఝా, సంజయ్‌కుమార్, ఆర్.వరదరాజన్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ఆంక్షలు



కలెక్టరేట్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 18: కలెక్టరేట్‌లో తిరుపతి ఎంపీ నామినేషన్ల స్వీకరణకు గురువారం ఏర్పాట్లు చేయడంతో పోలీసులు పెద్ద ఎత్తున ఆంక్షలు విధించారు. కలెక్టరేట్ నుంచి వంద మీటర్ల అవతల వరకు ర్యాలీలు, అభ్యర్థితో వచ్చే వాహనాలను నిలుపుదల చేశారు. ఉద్యోగులను కూడా తనిఖీలు చేశాకే లోనికి అనుమతించారు.

**ఎంపీ అభ్యర్థిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి నామినేషన్ దాఖలు**



తిరుపతి ఎంపీ అభ్యర్థిగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ గురువారం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఒక్క అవకాశమివ్వండి.. 30 ఏళ్ల ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవంతో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని విజయకుమార్ అన్నారు. ఆయనవెంట పరమశివన్ తదితరులున్నారు.

## గాంధీరోడ్డులో కాంగ్రెస్ ప్రచారం



తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 18: గాంధీరోడ్డులో కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతామోహన్ గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే కృష్ణాపురం ఠాణా, గిరిపురం, చెన్నారెడ్డికాలనీ, అంబేడ్కర్ కాలనీ, ఎంఆర్‌పల్లెలో తమ పార్టీకి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు గోపిగౌడ్, తేజోవతి, శాంతి యాదవ్, జావేద్, వెంకటేష్ గౌడ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



మంగళం, ఏప్రిల్ 18: ఎర్రచందనం పరిరక్షణకు అడవుల్లో కూంబింగ్ నిర్వహించే టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి గురువారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



ఇంటింటా ప్రచారం చేస్తున్న సీఆర్ రాజన్

తిరుచానూరు, ఏప్రిల్ 18: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. గురువారం తిరుచానూరు పంచాయతీలోని పలు కాలనీల్లో టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో తిరుచానూరు పంచాయతీ అధ్వానంగా తయారైందన్నారు. విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, భూకబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే, చిత్తూరు ఎంపీలుగా పులివర్తి నాని, దగ్గుమళ్ల ప్రసాదరావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి, సాల్మన్‌రాజు, దామినేడు రమేష్, కలీమ్, మునిరత్నంరెడ్డి, రాజేంద్ర, మురళి, నీలకంఠం, జనసేన వెంకట్‌రాయల్, బీజేపీ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేటగాళ్ల ఉచ్చుకు గజరాజు బలి



గంగవరం, ఏప్రిల్ 18 : మండలంలోని బూడిదపల్లె సమీపంలో వేటగాళ్ల ఉచ్చుకు మగ ఏనుగు మృత్యువాతపడింది. బుధవారం రాత్రి వేటగాళ్లు అడవి జంతువుల కోసం బూడిదపల్లె సమీపంలోని రైతు లక్ష్మయ్య పొలంలో కరెంటు తీగలను అమర్చారు. అర్ధరాత్రి అటువైపుగా వచ్చిన ఒంటరి ఏనుగు వాటిని తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం ఉదయం పశువుల కాపరులు, రైతులు గుర్తించి అటవీశాఖ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు, ఎఫ్ఆర్‌వో శివన్న, జిల్లా అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని ఏనుగు కళేబరాన్ని పరిశీలించారు. ఒంటిపై ఉన్న గాయాలను బట్టి కరెంట్ షాక్‌తోనే మృతిచెందిందని నిర్ధారించారు. మగ ఏనుగు అని, వయస్సు 20 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. జిల్లా అటవీ అధికారుల సమక్షంలో పంచనామా, ఖననం చేశారు.

## పాలిసెట్ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 18: పాలిటెక్నిక్ కోర్సులకు సంబంధించిన ప్రవేశ పరీక్ష పాలిసెట్-2024 ఈనెల 27వ తేదీన జరగనుంది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు హాల్ టిక్కెట్లను పాలిసెట్‌ఏపీ.ఎస్‌బీటీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వారకానాథ రెడ్డి సూచించారు. హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏమైనా సమస్యలుంటే కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

## 'తమిళ' ఉద్యోగులకు నేడు సెలవు: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 18: తమిళనాడులో శుక్రవారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన ఉద్యోగులు, కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వారికి శుక్రవారం సెలవుదినంగా ప్రకటించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న తమిళనాడు ఉద్యోగులు, కార్మికులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.02 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.02 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ప్రకటించింది. బుధవారం 58,690 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,744 మంది తలనీలాలు సమర్పించారు.

## జోరందుకున్న కూటమి ప్రచారం



ఆరణితోపాటు కూటమి నేతలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నేతలు

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రచారం జోరందుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులకు స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వీర తిలకాలు దిద్ది.. మంగళ హారతులు, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. 13, 14, 15 డివిజన్లలో ప్రజలతో మమేకమవుతూ, ఆప్యాయంగా అందరినీ పలకరిస్తూ గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సుగుణమ్మ గాజు గ్లాస్ చేతబట్టుకుని ఓట్లను అభ్యర్థించారు. భూమన కరుణాకర రెడ్డి, కుమారుడు అభినయ్ రెడ్డిలు టీటీడీ, కార్పొరేషన్‌కు ప్రజలు కట్టిన పన్నులతో అడ్డగోలుగా టెండర్లు పిలిచి కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు



పూరి గుడిసెలోని ఓ వృద్ధుడికి ఆరణితో కలసి గాజు గ్లాసు చూపి ఓటు అభ్యర్థిస్తున్న సుగుణమ్మ

నెల నెలా జీతాలు సక్రమంగా ఇవ్వలేని తండ్రీ కొడుకులకు అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదని మండిపడ్డారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో ఆ పార్టీ నేతలు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయ్ కుమార్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, శ్రీహరి నాయుడు, దంపూరి భాస్కర్ యాదవ్, చినబాబు, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, పాటకం వెంకటేష్, కరాటే చంద్ర, మునిరామయ్య, సుబ్బు యాదవ్, సుబ్బయ్య, ఆముదాల తులసీరాం, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, రాము, భారతమ్మ, రవి, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, పొనగంటి భాస్కర్, అజయ్ కుమార్, వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ నరేష్ శేఖర్, నాదముని, తేజ, బాలభాస్కర్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, పొలకల మల్లికార్జున్, రాజారెడ్డి, కొండ రాజయ్య, హేమంత్, ఆకేపాటి సుభాషిణి, బలరాం, రమేష్, హిమగిరి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## రేపు ఎస్వీయూలో ఓటరు అవగాహన కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీ యూనివర్సిటీలో వీసీ శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ హుస్సేన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభం కానుంది.

## చంద్రబాబు రేపటి సభను జయప్రదం చేద్దాం

● తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలంతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డితో కలసి శ్రీకాళహస్తి పట్టణంలో ప్రచారం చేస్తున్న వరప్రసాద్‌రావు

సత్యవేడు, ఏప్రిల్ 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే బహిరంగ సభను ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తిరుపతి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గురువారం సత్యవేడు టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలాన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చంద్రబాబు పర్యటన విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. వైసీపీ దుర్మార్గ పాలనపై సుదీర్ఘపోరాటం చేస్తున్న చంద్రబాబుకు అండగానిలవాల్సిన అవసరం ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌కు బుద్ధిచెప్పేలా ప్రజలను ఆయన సమాయత్తం చేస్తున్నారన్నారు. శనివారం చంద్రబాబు పుట్టిన రోజు కూడా కావడంతో ఈ బహిరంగ సభను అత్యంత భారీగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బాషా, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సుధీర్‌తో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. భారీ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

**IN THE COURT OF THE 5th ADDL. CIVIL JUDGE (Junior Division), TIRUPATI**
**O.S.No: 55 /2018**

Between:
Syndicate Bank, Padmavathipuram Branch (Former bank) Canara Bank, Padmavathipuram Branch (presently after merge) Rep. by its Principal Officer-cum-Branch Manager ..Plaintiff
And:
K. Subramanyam and another ...Defendants

**SUMMONS to DEFENDANT No.01**
K. Subramanyam, s/o K. Munaswamy, residing at D.No.19-8-70/G, SBI Colony, Tirupati town, Urban Mandal and District

Please take **SUMMON** that the plaintiff has filed the above suit against you and another and it is posted to **01-05-2024** for your appearance. you got any objection to decree the above suit, you can appear before the above court at 10-30 AM on the above date either in person or through your advocate and file your objections if any. If you fail to appear before the above court on the above date the above suit will be decided **EXPARTE.**
**Hearing Date: 01-05-2024 at 10-30 A.M**

**K. Ramanarayana Reddy**
**N. Madhusudhana Reddy**
Advocates/Tirupati

**పాకాల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S.No:9/2019**

Between:
వి.దొరస్వామినాయుడు, తండ్రి లేట్ పోతు నాయుడు నేలదానిపల్లి (వి), పాకాల (మం) - వాది
And
1) S.Subba Lakshmamma, W/o S.Subramanyam
2) S.Balakrishna, S/o Changaiah
Bothare residing at PachipalaPalli, Krishnapuram (Po), Pakala (M) - ప్రతివాదులు 1 & 2

**ప్రకటన**

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై కనిన వాది ప్రతివాదులపై O.S.No: 09/2019 దావా పాకాల కోర్టు నందు క్రింది కనిన షెడ్యూలు పై I.A.No: 24/2019 ఇంజంక్షన్ ఆర్డర్ పొందివున్నారు. అయితే ప్రస్తుతము ప్రతి వాదులు కోర్టు ఆర్డర్‌ను ఉల్లంఘించేయకుండా మూడవ పార్టీలకు అమ్ముటకు ప్రయత్నించుచున్నారు. అట్లు ఎవరైనను కొనుగోలు చేసినను చట్టబద్ధంగా అది చెల్లనేరదు. కావున ఇందుమూలంగా తెలియజేయడం అయినది.

**షెడ్యూలు**

తిరుపతి జిల్లా, పాకాల మండలం, మొగరాల రెవిన్యూ విలేజ్ are others, (1) S.No: 1138/3 an extent are 0.67 Cents. (2) S.No: 1138/CP an extent are 0.80 Cents, (3) S.No: 1138/5 an extent are 0.06 Cents, (4) S.No: 1059/1 an extent are 0.40 Cents, (5) S.No: 1059/2 an extent are 0.36 Cents. Total: 2.25 Cents.
తూర్పు: రోడ్డు, పడమర: చెరువు, ఉత్తరం: ఎస్.సుబ్రహ్మణ్యం, దక్షిణం: బండిబాట.

**J.M.Gowri Sankara Raju**, B.A.,L.L.B.,
Advocate for Plaintiff, Pakala.

## రుయాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 18: తిరుపతిలోని రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాక అరుదైన శస్త్రచికిత్స చేసి ఓ యువకుడి ప్రాణాలు కాపాడామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. గురువారం ఆ వివరాలను తెలిపారు. నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన ఆనంద్ బాబు(26) చిన్నతనం నుంచి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఏ ఆస్పత్రిలో చూపించినా నయం కాకపోవడంతో కుటుంబీకులు అతడిని రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బారావు పరీక్షించగా, ఊపిరితిత్తులో చీముతో కూడిన గడ్డలు (డెకాటికేషన్ ఆఫ్ లంగ్) ఉన్నట్లు గుర్తించారు. ఇది అరుదుగా వచ్చే వ్యాధి అని తేల్చారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి కళ్యాణి రమ, అనస్థీషియా విభాగాధిపతి రాధా ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదో తేదీన మినీ థొరకాటమీ (చిన్నపాటి రంధ్రం) పద్ధతిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ పద్ధతిలో శస్త్ర చికిత్స చేయడం



కోలుకున్న యువకుడితో రుయా అధికారులు

వల్ల రోగి రోజుల వ్యవధిలోనే కోలుకుంటాడని సూపరింటెండెంట్ తెలిపారు. ప్రస్తుతం యువకుడు కోలుకోవడంతో ఆయన్ను డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. సర్జరీని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, ఏఆర్ఎంవో హరికృష్ణ, క్లినిక్ పర్యవేక్షకుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## డీన్ నియామకం



ప్రొఫెసర్ వాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18: పద్మావతి వర్సిటీ సోషియల్ సైన్సెస్, హ్యూమనిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా జర్నలిజం ప్రొఫెసర్ వాణి నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రజని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 36 ఏళ్ల అధ్యాపక అనుభవంలో ఆరు పీహెచ్‌డీలకు వాణి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. హాస్టల్ వార్డెన్‌గా గతంలో పని చేశారు.



## కర్ణాటక యువకుడి అత్యుత్సాహం

● తిరుమల ఆలయం ముందు కాంగ్రెస్ నేతల ఫొటో ప్రదర్శన

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటకకు చెందిన నాగేంద్ర అత్యుత్సాహం ప్రదర్శించారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సౌమ్యారెడ్డితోపాటు మరి కొందరు నేతల ఫొటోలతో ఉన్న ఫ్రేమ్‌ని చూపిస్తూ శ్రీవారి ఆలయం ముందు హల్‌చల్ చేశాడు. సాధారణంగా తిరుమలకు రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలను తీసుకురావడం, వాటిని ప్రదర్శించడం, ప్రచారం చేయడం నిషేధం. భద్రతా వ్యవస్థతోపాటు, సీసీ కెమెరాల నిఘా ఉండే ప్రాంతంలో ఇలా నేతల ఫొటోలను ప్రదర్శిస్తున్నా భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడం గమనార్హం. సౌమ్యారెడ్డి అధిక మెజార్టీతో గెలవాలని స్వామిని కోరుకున్నట్టు మీడియా ముందుకు వచ్చి నాగేంద్ర చెప్పారు.



ఫొటో ఫ్రేమ్‌ను ప్రదర్శిస్తున్న నాగేంద్ర

## వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది: బీజేపీ


తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడటంతో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ నాయకుడు సామంచి శ్రీనివాసులు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని అధోగతి పాల్జేయడంలో ప్రథమ సీఎంగా జగన్ పేరు తెచ్చుకున్నారని మండిపడ్డారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. తిరుపతి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేస్తున్న వరప్రసాద్‌ను, ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని కోరారు. జనసేన అధికార ప్రతినిధి కీర్తన, మహేష్, వరప్రసాద్, శరత్ పాల్గొన్నారు.

## 5వేల ఓట్ల వరకు తొలగించాం

- దొంగ ఓట్ల వ్యవహారంలో విచారణ సాగుతోంది: తిరుపతి ఆర్వో

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాను మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాక ఏఎస్డీ (ఆబ్సెంటీస్, షిఫ్టెడ్, డెత్) 5వేల ఓట్ల వరకు తొలగించినట్టు తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ చెప్పారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నిబంధనలు పాటించి ఎన్నికలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. నామినేషన్లు స్వీకరించేందుకు తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో చోటు చేసుకున్న దొంగ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల సంఘం విచారణ చేపడుతోందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## రాస్‌లో శ్రీలంక ప్రతినిధులు



తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గురువారం శ్రీలంక ప్రతినిధులు పరిశీలించారు. శ్రీలంకకు చెందిన అఫ్లటాన్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకుడు మహేంద్ర ఆధ్వర్యంలో 30మంది సభ్యులు రాస్ ప్రధాన కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాలు, వృద్ధాశ్రమం నిర్వహణ, నర్సింగ్‌పై శిక్షణ, కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు అందిస్తున్న అవగాహన తదితరాలను పరిశీలించారు. ప్రాజెక్టు డైరెక్టర్లు రమేష్ రెడ్డి, యువరాజు, ఎస్.శ్రీనివాసులు, సుధారాణి పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనలో వైసీపీ విఫలం: సీపీఐ

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18: నగరంలోని ముదికివాడల్లో మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి పి.మురళి విమర్శించారు. గురువారం ప్రగతినగర్, లెనిన్ నగర్, గరుడాద్రి నగర్, కైకాలచెరువు కాలనీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు రామా నాయుడు, విశ్వనాథం, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




బమ్మిని తిమ్మిని చేయడంలో వైసీపీ నాయకులకు మించినవారు లేరు. అయితే ఒక్కోసారి ఇది వికటిస్తుంది కూడా. తిరుపతిలో గురువారం ఇదే జరిగింది. యధారీతిన వైసీపీ ఎన్నికల ప్రచారం 31వ డివిజన్లో సాగింది. వాకిళ్ల ముందుకు వెళ్లి పలకరించడాలు..పూలు చల్లించుకోవడాలూ.. పిల్లల్ని ఎత్తుకుని ముద్దాడడం వంటి సీన్లన్నీ మామూలే. ఆ తర్వాత మీడియాకు ఎన్నికల ప్రచారం సమాచారం రోజూ లాగే పంపారు. కట్టా జయరాం యాదవ్ అనే వైసీపీ నాయకుడు ప్రచారంలో పాల్గొన్నట్టు అందులో పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా వైసీపీ ఛాయలకే వెళ్లకుండా ఉండిపోయిన ఈయన మళ్లీ పార్టీ కండువా ఎప్పుడు కప్పుకున్నాడబ్బా అని అంతా నోరెళ్లబెట్టారు. ఆయన్ని అదే అడిగారు. తన పేరు వాడేసుకుంటున్నారని తెలిసిన కట్టా జయరాం యాదవ్ మాత్రం అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ప్రచారంలో నేను పాల్గొననే లేదంటూ సోషల్ మీడియాలోనే పోస్టులు పెట్టారు. '20 ఏళ్ల భూమన కుటుంబానికి చేసిన సేవలకు జరిగిన మర్యాద మరిచిపోలేకపోతున్నా' అని కడుపు చించుకున్నారు. నా కులానికి న్యాయం చేయమని అడిగినందుకు కుటుంబంలో కలహాలు పెట్టి, పోలీసు కేసులతో వేధించారని.. అటువంటి వాళ్ల కోసం పనిచేయబోనని ఆయన శపథం చేశారు. రెండున్నర ఏళ్లుగా పార్టీకి దూరంగా ఉన్నా తన పేరు ఎలా వాడుకుంటారని ప్రశ్నించారు. ఈ ఖండనతో ఉలిక్కిపడ్డ బులుగు రాతగాళ్లు ముందు పంపిన ప్రకటనను మార్చి ఆయన పేరు తీసేసి మరొక ప్రకటన పోస్టు చేశారు. ఎన్నికల రోజులు కాబట్టి ఇంత సున్నితంగా పేరు మార్చేశారుగానీ, లేకపోతేనా ఇంటి మీదకు బుల్డోజర్లే పంపి ఉండరా అని జనం గుసగుసలు పోయారు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

## అటు ఐదు లక్షలు..ఇటు ఇన్నోవా!

ఎన్నికలన్నాక కాలం నడిచేదంతా నోట్లమీదే కదా! ఐదేళ్లలో ఒక్కసారే ఆఫర్లు ఎగతన్నుకుని వస్తుంటాయి. అలిగినా డబ్బే.. ఆగ్రహించినా డబ్బే! వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలానికి చెందిన వైసీపీ నాయకుడు ఒకరు పార్టీ ఇంచార్జి తీరు పట్ల అసంతృప్తితో కొంతకాలంగా కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. తన అనుచర మిత్రులతో కలిసి టీడీపీలోకి మారిపోవాలనుకున్నారు. ఈనెల 16న ఆనం రాంనారాయణరెడ్డి సమక్షంలో కండువా మార్చుకునేలా నిర్ణయం జరిగిపోయింది. ఈ కార్యక్రమం ఘనంగా జరగాలి కదా అని రూ. 5 లక్షలు కూడా పుచ్చుకున్నారంట. 16న అనుచర బృందం అంతా టీడీపీలో చేరారు కానీ అసలాయన జాడ మాత్రం లేదు. ఏం జరిగిందబ్బా అని విచారిస్తే అసలు మందల తెలిసింది. ఎట్నో ఒకట్ట ఆయన్ని వైసీపీలోనే ఉండేలా ఒప్పించారంట. ఒప్పించడం అంటే మాటలతో కాదు చేతలతోనే. అలిగిన అసంతృప్తి నాయకుడి డిమాండ్ ఇన్నోవా వాహనం. సరే.. ఓకే! అనేయడంతో ఈయన టీడీపీ వాళ్లకి జెల్ల కొట్టేశాడు. విషయం తెలిసి.. కండువా కప్పుకోకపోతే పోయింది. నా ఐదు లక్షలన్నా ఎనక్కి ఇచ్చెయ్యి అని అడిగాడంట. 'అయిదా.. ఇంకా యాడుంది సామీ నా దెగ్గిర.. నేనేమన్నా కొరుక్కు తిన్నానా.. జనానికి ఎప్పుడో పంచేశాను. మిగిలింది ముప్పయి వేలే. కావాలంటే చెప్పు ఎనక్కి ఇచ్చేస్తాను' అని నిజాయితీ మాటలు మాట్లాడడంతో టీడీపీ నాయకుడు తెల్లమొహం వేశాడంట. ఇప్పుడీ సంగతి వెంకటగిరి నియోజకవర్గంలో ఓరల్‌గా భలే వైరల్ అవుతోంది. - తిరుపతి,ఆంధ్రజ్యోతి



అట్టుంటనా!



తిరుపతి జనకేతనం
www.andhrajyothy.com
శుక్రవారం 19 ఏప్రిల్ 2024





● చెప్పాడంటే.. చేయడంతే!



మన్నవరం భెల్-ఎన్టీపీసీ ప్రాజెక్టు ప్రవేశ ద్వారం



కార్యాలయ భవనం

# 'మన్నవరం' ఏమైంది జగన్?

పదవీ కాలం పూర్తయినా పత్తా లేని ప్రాజెక్టు

తెరిపిస్తానన్న హామీ నిలబెట్టుకోని సీఎం

అధికారంలోకి రాగానే మన్నవరం పారిశ్రామిక ప్రాజెక్టు పూర్తి చేయిస్తా.

- పాదయాత్ర సందర్భంగా 2018 జనవరి 21న శ్రీకాళహస్తిలో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ. 30 వేల మందికి ఉద్యోగాలు దొరికే భారీ ప్రాజెక్టు కావడంతో ఈ మాటకు జిల్లా ప్రజలు మురిసిపోయారు. ఓట్లన్నీ గంపగుత్తగా వైసీపీకి వేసేశారు. ఆయనైతే అధికారంలోకి వచ్చారు. కానీ, ఐదేళ్లు గడిచినా మన్నవరం ప్రాజెక్టు అతీగతీ లేదు. ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటి? అని పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి కేంద్రాన్ని ప్రశ్నించడంతో సరిపెట్టారంతే.



మెగా ప్రాజెక్టు యాష్ ప్లాంట్

### ప్రాజెక్టు స్వరూపం:

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (బీహెచ్ఇఎల్-ఎన్టీపీసీ) వంటి ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో విద్యుత్ ఉపకరణాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించాయి. రూ.6500 కోట్ల భారీ పెట్టుబడితో, 30 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించే ఈ భారీ పరిశ్రమను ఎన్టీపీసీ భెల్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట జాయింట్ వెంచర్‌లో నెలకొల్పేందుకు ఒప్పందానికి వచ్చాయి. 2010 సెప్టెంబరు 1న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మన్నవరం వద్ద ఆ ప్రాంతానికి దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరిట వైఎస్ఆర్ పురం అని పేరు కూడా పెట్టారు. ఈ పరిశ్రమకు అనుబంధంగా 30 పరిశ్రమలు కూడా ఏర్పాటవుతాయని అప్పట్లో కేంద్రం ప్రకటించింది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై శ్రద్ధ పెట్టలేదు. భెల్, ఎన్టీపీసీ సంస్థలు రూ.వంద కోట్ల చొప్పున రూ.200 కోట్లు ప్రాథమికంగా విడుదల చేశాయి. పరిపాలనా భవనం, యాష్ ప్లాంట్, ప్రహరీ నిర్మించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు పూర్తిగా మరుగునపడిపోయింది. జిల్లాలోని నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి. ఆ సమయంలో తాను అధికారంలోకి రాగానే మన్నవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయించడానికి ప్రయత్నిస్తానని ప్రతిపక్ష నేతగా జగన్ చెప్పిన మాట.. యువతలో ఆశలు నింపింది.

### ఎంపీ ప్రశ్నతో సరి

2019 జూన్‌లో జగన్ సీఎం అయ్యాక మన్నవరం ప్రాజెక్టు పూర్తి చేయించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయలేదు. సంబంధిత మంత్రులతో, ప్రధానితో మాట్లాడలేదు. కనీసం ఎంపీల బృందాన్ని కూడా కేంద్రం వద్దకు పంపింది లేదు. పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి మాత్రం ఒకసారి మన్నవరం ప్రాజెక్టు పరిస్థితి ఏమిటనే ప్రశ్న లేవనెత్తారు. అది తప్ప రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఇంకెలాంటి ప్రయత్నం జరగలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో అధికార పార్టీలో బలమైన నేతలున్నా 30 వేల మందికి ఉద్యోగాలు లభించే ఈ ప్రాజెక్టుపై కనీస శ్రద్ధ పెట్టలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యంత అవినీతిపరులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోకుండా, బదిలీలు కాకుండా సీఎం వోలో పలుకుబడి ప్రదర్శించిన అక్కడి ఎమ్మెల్యే.. పదిమందికీ ఉపయోగపడే ఈ పని గురించి మాత్రం తనకు సన్నిహితుడైన సీఎం జగన్ వద్ద ఏనాడూ ప్రస్తావించింది లేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

**తిరుపతి రాజకీయాల్లో బలమైన ముద్రగల కుటుంబం మబ్బు కుటుంబం. తిరుపతి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన మబ్బు రామిరెడ్డి ఇప్పుడు లేకపోయినా ఆ కుటుంబం పేరు మాయలేదు. పెదబ్బగా తిరుపతివాసులు ఆత్మీయంగా పిలుచుకునే ఆయన కుమారుడు మబ్బు దేవనారాయణరెడ్డికి మబ్బు యువసేన పేరుతో గట్టి అనుచరవర్గం ఉంది. మున్సిపల్ ఛైర్మన్, ఎమ్మెల్యేగా కూడా గతంలో పోటీచేసిన పెదబ్బ 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. తిరుపతి ఎన్డీఏ అభ్యర్థి ఆరణి శ్రీనివాసుల విజయం కోసం ఉధృతంగా ప్రచారంలో ఉన్నారు.**

## దొంగ ఓటర్లను తరిమికొడతాం

### మబ్బు దేవనారాయణ రెడ్డి



● ఫటాఫట్

**? భూమన అభినయ్ గురించి 'ప్రత్యర్థిగా నథింగ్' అంటూ మీరన్న మాట వైరల్ అవుతోంది. కాస్త ఓవర్‌గా లేదా.**

! నిజమే చెప్పాను. 2019లో రాష్ట్రంలో వైసీపీ తుఫాను వీచింది. అప్పుడు కూడా తిరుపతిలో భూమనకి పడ్డ ఓట్లు ఎన్ని? ఎలా గెలిచారు? ప్రభుత్వ వ్యతిరేకత హోరెత్తుతున్న ఇప్పుడు వాళ్లు గెలవగలరా? అందుకే మళ్లీ చెబుతున్నా.. తిరుపతిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాకు నథింగ్.

**? ఉప ఎన్నికల్లో లాగే దొంగ ఓట్లు దండెత్తితే మీరేం చేయగలరు.**

! పోలింగ్ రోజు ఉదయం 7నుంచే బృందాలుగా పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకుంటాం.దొంగ ఓటు కనిపిస్తే ఉపేక్షించం.ఎంతవరకైనా వెళ్తాం.దొంగ ఓటరు పోలింగ్ బూత్ వద్దకు రావాలంటేనే భయపడేలా చేస్తాం.

**? పొత్తులో సీటు కోల్పోయామనే అసంతృప్తి నుంచి టీడీపీ బయటపడినట్టేనా?**

! తిరుపతిలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. అయినా పొత్తు నిర్ణయాన్ని గౌరవించాల్సిందే. కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేస్తాం.

**? వైసీపీలోకి పిలవలేదా**

! చాలామందితో రాయబారాలు పంపారు. 1994 ఎన్నికల్లో మా నాన్న మబ్బు రామిరెడ్డికి వ్యతిరేకంగా కరుణాకర్‌రెడ్డి ఒకే పార్టీలో ఉండి పనిచేశారు. 2004లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రైన ఆరునెలల్లోనే మమ్మల్ని రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేశారు. తిరుమలలోవున్న మా లాడ్జీని కూలదోశారు. అప్పుడు వైఎస్ఆర్‌ని కలిస్తే 'కరుణతో కలిసిపో' అన్నారు. 'అది అసాధ్యం' అని చెప్పేసి, ఎలాంటి పరిహారం తీసుకోకుండా లాడ్జీని టీటీడీకి ఇచ్చేశాం. వాళ్ల కక్ష సాధింపులు ఎంత తీవ్రంగా ఉంటాయో అనేందుకు మాదొక ఉదాహరణ. రాజకీయాలైనా మానుకుంటా గానీ వాళ్లతో కలవను. ఆత్మాభిమానాన్ని చంపుకోలేను.

**? భూమనపై స్థానిక రెడ్లలో వ్యతిరేకత ఎందుకు ఉంది**

! ఆయన అహంకార ధోరణే అందుకు కారణం. తిరుపతిలో 90 శాతం రెడ్లు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు.

**? మీరు కూడా టికెట్ ఆశించారు కదా**

! అవును. అయితే సామాజిక సమీకరణల్లో తిరుపతిలో బలిజలకే సీటు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. అంగీకరించి పనిచేస్తున్నా. పవన్ కల్యాణ్ ఇటీవల తిరుపతి పర్యటనకు వచ్చినప్పుడు మనస్సుకు హత్తుకునేలా మాట్లాడారు. మా పనితీరును చూసి నామినేటెడ్ పదవుల విషయంలో చంద్రబాబుతో కలసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తిరుపతిలో ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించుకున్న తర్వాతే పదవి అడుగుతాను.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

# గూడూరు వైసీపీలో గుబులు



పాశం సునీల్‌కుమార్ | మేరిగ మురళీధర్ | చిల్లకూరు వేమయ్య

● వర్తమానం

ప్రభుత్వ వ్యతిరేకతకూ తోడైన స్థానికత అంశం

ఐదేళ్లూ జనం మధ్య టీడీపీ అభ్యర్థి సునీల్

అదనపు బలంగా నిలుస్తున్న మిత్రపక్షాలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 18: దశాబ్దం తర్వాత ఖనిజాల గడ్డ గూడూరులో జెండా ఎగురవేయాలని టీడీపీ ఉవ్విళ్లూరుతుండగా సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని వైసీపీ ఆరాటపడుతోంది. అధికార వైసీపీ నుంచి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో ఉమ్మడి కూటమి పక్షాన టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ తలపడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చిల్లకూరు వేమయ్య బరిలో ఉన్నా వైసీపీ, టీడీపీల ముఖాముఖి పోరు జరగనుంది. మునుపటి సానుకూల వాతావరణానికి భిన్నంగా పరిస్థితులుండటం ఈసారి వైసీపీని కలవరపెడుతోంది. అతి ఆత్మవిశ్వాసంతో పార్టీ అధిష్ఠానం ఐదేళ్ల పదవీ కాల పరిమితి ఉన్న ఎమ్మెల్సీ మురళీధర్‌ను బరిలో దించడాన్ని క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఈయన అభ్యర్థిత్వంపై అభ్యంతరాలు వ్యక్తమైనా అధిష్ఠానం పట్టించుకోలేదు. ఇక్కడి సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా నిలబడటం తలనొప్పిగా తయారైంది. ప్రభుత్వ వ్యతిరేకతకు తోడుగా సిట్టింగ్ ఎమ్మెల్యేనే ప్రత్యర్థితో కలిసి సవాలు విసరడం కూడా వైసీపీ వర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. తమ అభ్యర్థి స్థానికత అంశం ప్రభావం చూపే ప్రమాదముందని కలవరపడుతోంది. అభ్యర్థిలో కలుపుగోలుతనం లేదంటూ పార్టీ శ్రేణులు పెదవి విరుస్తున్నాయి. తగినంత సమయం లేకపోవడం కూడా మురళికి ప్రతికూలాంశం. దీనికితోడు ఇతర పార్టీల నుంచి ఆశించినంతగా చేరికలు లేవు.

### టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

ఈ ఐదేళ్లూ నియోజకవర్గంలో అన్ని వర్గాలతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ మమేకమవుతున్నారు. మిత్రపక్షాలను కలుపుకొని ముందుకెళుతున్నారు. స్థానికత అంశం ఈయనకు బాగా కలిసొస్తుందని పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. గూడూరు పట్టణంతోపాటు తీర, గ్రామీణ ప్రాంతాలలోనూ సునీల్ కష్టపడి పనిచేస్తూ బలమైన పునాది ఏర్పరుచుకున్నారు. ఇప్పటికే టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో అంశాలు ఆశాజనకంగా ఉండడంతో సునీల్ శిబిరంలో ఉత్సాహం కనిపిస్తోంది. పవన్ అభిమానులతోపాటు నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న కాపు సామాజిక వర్గ ఓట్ల ప్రభావం కచ్చితంగా విజయతీరానికి చేర్చుతుందని సునీల్ నమ్ముతున్నారు. గత ఎన్నికలలో ప్రత్యర్థిగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు ఈసారి ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా ఉండడం కూడా కలిసివచ్చే అంశం.

### కాంగ్రెస్ ఓట్లతో వైసీపీకి గండి

కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చిల్లకూరు వేమయ్యకు పోలయ్యే ఓట్లు తమకు నష్టం కలిగిస్తాయని వైసీపీ వర్గాలలో అంతర్గతంగా ఆందోళన మొదలైంది. గతంలో ఈ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఆరు సార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. షర్మిల పార్టీ పగ్గాలు చేపట్టాక కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. ఆమె ప్రభావంతో ఏమాత్రం ఓట్లు కాంగ్రెసుకు పోలైనా తమకు గండి పడి నష్టం తప్పదని వైసీపీ నాయకులు చర్చించుకుంటున్నారు.

## ఈశాన్యం మంచిదంట



● సెంటిమెంట్

కురుగొండ నుంచి ప్రచారం ప్రారంభిస్తే గెలిచేది గ్యారంటీ అనే నమ్మకం అన్ని పార్టీల అభ్యర్థులనీ ఓజిలి మండలంలో ఉన్న ఈ ఊరికి తరుముతోంది. 2009 దాకా ఓజిలి మండం వెంకటగిరి నియోజకవర్గంలో ఉండేది. ఆ తర్వాత సూళ్లూరు పేట నియోజకవర్గంలోకి మారినాకనే ఈశాన్యం సెంటిమెంట్ తెరమీదకు వచ్చింది. 2009లో అప్పటి టీడీపీ అభ్యర్థి పరసా వెంటరత్నం, కాంగ్రెస్ అభ్యర్థిని విన్నమాల సరస్వతిలు ఇద్దరూ కురుగొండ నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికలన్నాక ఎవరో ఒకరు ఓడితేనే గదా మరొకరు గెలిచేది. పరసా వెంకటరత్న 5,367 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లలో టీడీపీ అభ్యర్థి పరసా వెంకటరత్న, వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యలు కూడా ఈశాన్యం సెంటిమెంటునే పాటించారు. కురుగొండనుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ రెండు పర్యాయాలూ వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య గెలుపొందారు. ఇప్పుడు.. 2024 ఎన్నికల ప్రచారం కూడా టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, వైసీపీ అభ్యరి కిలివేటి సంజీవయ్యలు ఇద్దరూ కురుగొండ నుంచే చేపట్టారు. సెంటిమెంటు ఎవరిని ఓడిస్తుందో, ఎవరిని గెలిపిస్తుందో తెలుసుకోవాలంటే జూన్ 5 దాకా ఆగాల్సిందే గదా!

- ఓజిలి



## ముంచుకొస్తోంది ముహూర్తాల వేళ

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 18: ప్రతి పనికీ మంచి ముహూర్తం చూసుకోవడం చాలామందికి అలవాటు. అలాంటిది ఐదేళ్ల పదవీయోగమంటే మాటలా.. దివ్యమైన ముహూర్తం చూడాల్సిందే. అందుకే ఈ ఎన్నికల నామినేషన్ల వేళ నాయకులంతా పురోహితుల వెంట పడుతున్నారు. తిరుపతిలో ఇలా ముహూర్తాలు పెట్టడంలో దిట్టలుగా పేరు మోసిన పురోహితులు దాదాపు ఏడుగురున్నారని సమాచారం. అభ్యర్థులు నమ్మకమైన పురోహితులను ఆశ్రయించి జాతకాలు, చక్రబలం, నామనక్షత్రం చెప్పించుకుంటున్నారు. దీంతో జాతక ఫలాలు చూసేవారికి డిమాండూ పెరిగిపోయింది. ముహూర్తం పెట్టడానికి వీరు రూ.5000 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా 19వ తేదీ ఉదయం 11.53 నిమిషాల నుంచి 12 గంటల లోపు, 20న ఉదయం 11.49 నిమిషాలు, 22వ తేదీ ఉదయం 11 గంటలకు ముహూర్తం ఫస్ట్ క్లాస్‌గా ఉందని పంచాంగ కర్త శ్రీనివాసాచార్యులు చెబుతున్నారు. అలాగే 23న ఉదయం 11.37 గంటల నుంచి 11.50 లోపు, 24న మధ్యాహ్నం 12.31 గంటలకు, 25న ఉదయం 11.31 నిమిషాలకు నామినేషన్లు వేయడానికి మంచి ముహూర్తాలు ఉన్నాయంటున్నారు.


## నాటు..నాటు..నాటు!

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18 : ఎన్నికల వేళ తిరుపతి జిల్లాలో నాటు ఘాటు గుప్పుమంటోంది. ముఖ్యంగా చంద్రగిరి నియోజకరవర్గంలోని ఎర్రావారిపాలెం, భాకరాపేట, తలకోన అటవీ ప్రాంతాలతో పాటు విజయపురం. జంబాడ, సత్యవేడు, ఊత్తుకోట సరిహద్దు గ్రామాలు, పుత్తూరు, నగరి, తిరుపతి రూరల్ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సారా తయారవుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ సారాకు డిమాండ్ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో నిన్నా, మొన్నటి వరకు రోజుకు 10వేల లీటర్లు తయారు చేసేవారు. ప్రస్తుతం 18వేల లీటర్ల వరకు తయారు చేస్తున్నట్లు సమాచారం. తయారీదారులకు అధికార పార్టీ నాయకుల సహకారమందుతోందని తెలుస్తోంది. మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ రూ.300 పలకడంతో కొని తాగలేక పల్లెల్లోని చాలా మంది నాటు వైపు మొగ్గుచూపుతున్నారు. లీటరు రూ.280 నుంచి రూ.300 వరకు దొరకడంతో మందు బాబులు సారా విక్రయ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో పార్టీల అభ్యర్థులు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు ప్రచారంలో పాల్గొనే వారికి నాటు సారా ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. డిమాండ్ పెరగడంతో జిల్లాలో రోజుకు దాదాపు రూ.80 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. కాగా తాము మాత్రం నాగలాపురం, ఎర్రావారి పాలెం, పుత్తూరు, విజయపురం ప్రాంతాల్లో సారా తయారీపై ఫోకస్ పెట్టామని, దొరికితే వదలి పెట్టే ప్రసక్తే లేదని సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర చెబుతున్నారు.





సారా తయారీ కోసం సిద్ధం చేసిన ఊట, డ్రమ్ముల్లో వున్న ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం



## ఇస్తారా.. చస్తారా!

'పిల్చుకొచ్చేటపుడు ఒక మాట. కూలి డబ్బులిచ్చేటప్పుడు ఇంకొక మాట. ఇదేమి న్యాయం?' అంటూ నిలదీస్తున్న ఆ ఆడవాళ్లను చూసి ఏం జరిగిపోతోందా అని ఆసక్తితో కుప్పం నడి బజారులో గురువారం అందరూ పోగయ్యారు. ఫ్లాష్ బ్యాక్ ఏందంటే.. బుదారంనాడు బులుగు పార్టీవోల్లు కుప్పంలో ర్యాలీ పెట్టుకున్నారు. జనం గనంగా ఉండాలనే రొండు నూర్ల మందిని కూడేసినారు. పార్టీ జెండాలు చేతికిచ్చి జేజేలు పలికిస్తూ ఊరంతా తిప్పించినారు. ఎర్రటి ఎండలో తిరిగీ తిరిగీ ఆ పార్టీ లీడరు ఇంటికి చేరుకునేసరికి సాయంత్రమైపాయె. దుడ్లు ఇస్తే వెళ్లిపోదామని బయట నిలబడ్డారు. లేటయిపోతా ఉండడంతో ఇళ్లలో పనీ పాటా ఉంటుంది గదా.. మా దుడ్లు గూడా మీరే తెచ్చేయ్యండి అని చెప్పి కొందరు ఇళ్లకి వెళ్లిపోయారు. ఆ తర్వాత దుడ్లు తెచ్చి పంచే పని మొదులు పెట్టినారు. తలా ఐదొందలు చేతల్లో పెట్టినారు. అయితే ఉండేవాళ్లకే దుడ్లు అని చెప్పడంతో ఎర్రటి ఎండనబడి తిరిగిన ఆడోళ్ల కడుపులు కాలిపాయ. నోళ్లు తెరిచినారు. దాంతో దిగొచ్చి పిల్చుకొచ్చిన వాళ్లందరికీ దుడ్లు లెక్కగట్టి ఇచ్చినారు.

- కుప్పం

## ఆ ఇద్దరూ కలిసేకి అయ్యేదేనా!

బెదిరించో, బుజ్జగించో మనుషుల్ని కలపచ్చుకానీ, మనసుల్ని కలపగలరా? గురువారం పలమనేరు వైసీపీ అభ్యరి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, నామినేషన్ వేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడల తీరు చూస్తే మాత్రం మనసులు కలిపేది అయ్యేకేనా అనిపించింది. వి.కోట మండలానికే చెందిన ఈ ఇద్దరూ ఒకే సామాజికవర్గం కూడా. ఒకే పార్టీలో రెండు కత్తుల్లా కొనసాగుతూనే ఉన్నారు. ప్రొటోకాల్ రగడలు తారస్థాయికి చేరడంతో పెద్దిరెడ్డి మధ్యస్తం తప్పలేదు. ఈసారి టికెట్ తనకు ఇవ్వచ్చు కదా అని శ్రీనివాసులు ఆశపడ్డా అధిష్ఠానం వెంకటేగౌడకే ఇచ్చింది. పార్టీ పెద్దల హెచ్చరికలతో ఇద్దరూ కొంతకాలంగా ఒకే వేదికల మీద కనిపిస్తున్నా ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు. గురువారం పలమనేరులో నామినేషన్ దాఖలుకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలోనూ ఈ ఇద్దరూ ఇలాగే కనిపించారు. దీంతో కష్టమేనప్పా ఇద్దరినీ కలిపేది అని పార్టీవారే చెవులు కొరుక్కున్నారు.

- వి.కోట



ఇదీ ముందు



# చిత్తూరు జన కేతనం

www.andhrajyothy.com

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

సర్పంచులు.. ఒకప్పట్లో వెలిగారు. ప్రజలకు చేరువలో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులు చేస్తూ, మౌలిక వసతులు కల్పిస్తూ గుర్తింపు పొందారు. అలాంటి సర్పంచులను జగన్ ప్రభుత్వం డమ్మీలుగా మార్చేసింది. నిధులు, విధులు, అధికారాలు లేకుండా చేసింది. ఈ పరిణామం పట్ల అధికార పార్టీ గ్రామ ప్రజాప్రతినిధులూ అసహనంతో ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి




పంచాయతీ ఖాతాల్లో నిధులు మళ్లించిన ప్రభుత్వంపై కేసు పెట్టాలంటూ ధర్నా చేస్తున్న సర్పంచులు (ఫైల్ ఫొటో)

# డమ్మీ సర్పంచులు!

- స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసిన జగన్
- పంచాయతీల ఖాతాల్లో నిధులు జీరో
- ఉమ్మడి జిల్లాలో రూ.195 కోట్ల మళ్లింపు
- చిన్న సమస్యనూ పరిష్కరించలేని స్థితిలో గ్రామపాలకులు



మోసం గురూ!

ఉమ్మడి జిల్లాలోని 1411 గ్రామ పంచాయతీలకు కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్ని విడతల వారీగా రూ.195 కోట్లను జమ చేసింది. జమ చేసిన వెంటనే ఆయా నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. చాలా మంది సర్పంచులు గౌరవం కోసం అప్పులు చేసి మరీ స్థానిక సమస్యల్ని పరిష్కరించారు. ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. దీంతో అప్పులకు వడ్డీలు కట్టుకోలేక సర్పంచులు అల్లాడుతున్నారు. ఇక అప్పు చేసే స్థోమతలేని సర్పంచులు సమస్యల్ని అలాగే వదిలేశారు. చిన్నపాటి సమస్యలనూ పరిష్కరించలేక, ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారు. తమ నిధుల్ని మళ్లీ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని సర్పంచులు ఎన్నో ఉద్యమాలు చేశారు. నిధుల్ని దొంగిలించిన సీఎం జగన్ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ గతేడాది జూలైలో చిత్తూరులో ధర్నా చేసి, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా, ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీనికితోడు వలంటీరు, సచివాలయ వ్యవస్థతో సర్పంచుల్ని పట్టించుకునేవారు లేకుండా పోయారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో వీరి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ పరిణామాల పట్ల జగన్ ప్రభుత్వంపై సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం అధికార పార్టీకి చెందిన సర్పంచులే ఉన్నారు.

*బంగారుపాళ్యం మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీకి మూడేళ్లలో రూ.39 లక్షల ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. ఈ నిధుల్లో నయా పైసా పంచాయతీ అవసరాలకు ఇవ్వకుండా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. బోర్లు, పైపు లైన్లు, డ్రైనేజీ తదితర పనుల కోసం స్థానిక సర్పంచి ప్రెస్టేజ్ కోసం రూ.14 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశారు. ఆ నిధులు ఏళ్లుగా రాకపోవడంతో వడ్డీలు కట్టుకుంటున్నారు.*

### ఏ ముఖ్యమంత్రీ చేయలేదిలా..

ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి.. ఇలా ఏ సీఎం కూడా పంచాయతీ కార్యాలయాలకు కరెంటు బిల్లు తీసుకోలేదు. సీఎం జగన్ మాత్రం విద్యుత్తు బకాయిల పేరుతో మా పంచాయతీల నిధుల్ని తీసేసుకున్నారు. ఖజానాలో డబ్బుల్లేకపోవడంతో 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్నీ మళ్లించేశారు. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి లేకుండా పోయింది. మేము బాధ్యతలు తీసుకుని మూడేళ్లయినా పైసా నిధులు ఇవ్వలేదు.

- భగవతి, ఓటివారిపల్లె సర్పంచి, యాదమరి మండలం





### ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నా

నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన ప్రజలకు నేను న్యాయం చేయలేకపోతున్నాను. వాటర్ ప్లాంట్ నిర్మించాను, తాగునీటి బోర్లు, పైపు లైన్లు వేశాను. ఇప్పటికే సుమారు రూ.2 లక్షల బిల్లులు రావాలి. కనీసం వీధి లైట్లు వేయాలన్నా ఖాతాల్లో నిధులు లేవు. సొంత డబ్బుల్ని ఖర్చు చేస్తున్నాం.

- ఊహ, నంజరపల్లె సర్పంచి, పెనుమూరు మండలం



### వడ్డీలు కట్టుకోలేక..

మాకు వచ్చిన ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం దొడ్డి దారిన మళ్లించేసింది. దీంతో చిన్నపాటి పనులూ చేయలేకపోతున్నాం. తాగునీటి బోర్ల మరమ్మతు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి లైట్ల వంటి చిన్నపాటి పనులకు అప్పులు చేశా. ఇప్పుడు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నా. నన్ను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నా.

- ఉషశ్రీ, తుంబపాళ్యం సర్పంచి, బంగారుపాళ్యం మండలం

### జగన్‌ను ఇంటికి పంపేందుకు పనిచేస్తున్నాం



రాష్ట్రంలోని పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన రూ.8660 కోట్ల ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం లాగేసుకుంది. 2023-24 సంవత్సరానికి రెండో విడతగా వచ్చిన రూ.988 కోట్లనూ పంచాయతీల ఖాతాల్లో వేయలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన రిజిస్ట్రేషన్, మైనింగ్ ఫీజు, ఎంటర్‌టైన్‌మెంట్, ప్రొఫెషనల్ ట్యాక్సునూ జమ చేయలేదు. రాష్ట్రంలోని 12918 మంది సర్పంచులు వైఎస్ జగన్‌ను గద్దె దింపాలని పనిచేస్తున్నాం.

- కోకా ప్రకాష్‌నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు

## నగరిలో నామినేషన్ వేయాలంటే..!



నగరి అసెంబ్లీ అభ్యర్థులకు ఓ సెంటిమెంటు ఉంది. నామినేషన్ వేసే ముందు వీరంతా పట్టణంలోని కొత్తపేటవద్ద గల అగరవినాయకస్వామి దేవాలయంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ఇలా..

● సెంటిమెంట్

గతంలో మాజీమంత్రి చెంగారెడ్డి, దొరస్వామిరాజు, ప్రస్తుతం భానుప్రకాష్, రోజా ఆ సెంటిమెంట్ పాటిస్తున్నారు. అదే క్రమంలో గురువారం టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆలయంలో పూజలు చేసి.. వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని.. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి ర్యాలీగా వెళ్లి నామినేషను వేశారు.

- నగరి

## అభ్యర్థులూ.. నోటరీ విషయంలో జాగ్రత్త

ఉమ్మడి జిల్లాలో నామినేషన్ వేసే అభ్యర్థులూ.. నోటరీ అంశంలో జాగ్రత్త. లేదంటే నామినేషన్లు తిరస్కరణకు గురయ్యే ప్రమాదముంది. సాధారణంగా నామినేషన్‌తో పాటు ధ్రువీకృత లైసెన్స్‌డ్ అడ్వకేట్‌తో నోటరీ చేయించాలి. వీరిని గుర్తించడంలో అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన అవసరం. ఆదాయ, స్థిర, చరాస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర అంశాలను నామినేషన్ ఫారంలో పూరించి 13 డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్ పత్రంతో పాటు వివరాలను ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌పై నోటరీ సమర్పించాలి. జిల్లాలో చాలామంది అడ్వకేట్ నోటరీలు లైసెన్స్ గడువు ముగిశాక రెన్యువల్ దరఖాస్తు పంపి నోటరీగా కొనసాగుతున్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ అనుమతి ఇస్తుంది. చాలామంది గతంలో నోటరీ లైసెన్స్ పొంది, తర్వాత రెన్యువల్ చేసుకోకుండా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది రిజిస్ట్రేషన్ల కార్యాలయాల పరిధిలో ఐదేళ్ల కిందట వంద మందికి పైగా నోటరీలు ఉండగా, తాజాగా 35 మంది మాత్రమే ఉన్నారు. వారి వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో మంగళవారం అందుబాటులో ఉంచారు. వీరి పేర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఎనిమిది మంది రిటర్నింగ్ అధికారులకు పంపారు. ఇన్‌వ్యాలిడ్ నోటరీలతో ధ్రువీకరిస్తే నామినేషన్లు చెల్లుబాటు కావని అభ్యర్థులు గుర్తించాలని అధికారులు సూచిస్తున్నారు.

● నోట్ దిస్ పాయింట్

- చిత్తూరు కలెక్టరేట్

## ఫ్యామిలీ క్యాంపెయిన్

చిత్తూరు లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుటుంబ సమేతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గుడిపాల మండలం పసుమందలో దగ్గుమళ్ల సతీమణి సుజాత, తనయుడు రాధే, కుమార్తె రాజీవి, కోడలు ఎస్తేర్ ప్రియాంక, మనవళ్లు రేయాన్స్, రిహాన్స్, మనవరాలు మిషికా మైరా, పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తనను ఎంపీగా గెలిపిస్తే పసుమంద గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.


- చిత్తూరు సిటీ



● వర్తమానం/ కుప్పం

ఒకవైపు అభివృద్ధి జరగలేదు. మరోవైపు దాడులు.. పోలీసు కేసులు పెరిగాయి. అందుకే భారీ ఆధిక్యంతో వైసీపీని ఓడించాలన్న కసితో కుప్పం టీడీపీ శ్రేణులు పనిచేస్తున్నాయి. అధినేత నిర్దేశించిన 'లక్ష' లక్ష్యంతో జోష్‌గా ముందుకు సాగుతున్నాయి. అటు వైసీపీ.. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల సహాయ నిరాకరణ, విభేదాల ఉక్కపోతతో సతమతమవుతోంది. కొందరు నేతల క్వారీ, ఇసుక, భూదందాలు, అక్రమాలు శాపాలుగా వెంటాడుతున్నాయి. గ్రామాల్లో రెండు పార్టీలకు లభిస్తున్న ఆదరణ పరంగా ఈ తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

# టీడీపీలో జోష్



- 'లక్ష' మెజారిటీ లక్ష్యంగా విస్తృత ప్రచారం
- విభేదాల ఉక్కపోతలో వైసీపీ
- కుప్పం రాజకీయ ముఖచిత్రం

టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇక్కడే ఉంటూ పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారు. యువతను సమీకరిస్తూ వారికే ప్రధాన బాధ్యతలు అప్పగిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. మరోవైపు చంద్రబాబు క్లాస్‌మేట్, సుదీర్ఘకాలంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న పీఎస్ మునిరత్నం గ్రామాల్లో పర్యటిస్తూ.. సీనియర్లందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారాన్ని నడిపిస్తున్నారు. ఇంతకాలం అనారోగ్యంతో ఉన్న చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ కూడా జనాల్లోకి వస్తున్నారు. కాంగ్రెస్‌నుంచి పార్టీలో చేరిన డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు గ్రామస్థాయిలో తనకున్న పరిచయాలతో పార్టీ బలాన్ని పెంచడంలో తనవంతు కృషి చేస్తున్నారు. ఇక, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తన అనుభవంతో పార్టీకి పునర్వైభవం తేవడంలో తవనంతు పాత్ర పోషిస్తున్నారు. ఇక, చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా విధించుకున్న పార్టీ శ్రేణులు, ఆ దిశగా చురుగ్గా కదులుతున్నాయి. వైసీపీ నవరత్నాల ప్రభావాన్ని సూపర్ సిక్స్ పథకాల ప్రచారంతో దీటుగా ఎదుర్కొంటున్నారు. ఇలా, నాయకులు, కార్యకర్తలు గతంలో చిన్నచిన్న విభేదాలేవైనా ఉంటే పక్కనపెట్టి మరీ ఎన్నికల రంగంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాయకులు వెంట ఉన్నా లేకున్నా ఎవరికివారు స్వచ్ఛందంగా ప్రచారాలలో పాల్గొంటూ టీడీపీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్నారు.



అనిమిగానిపల్లెలో ఇటీవల టీడీపీ నేతల ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న జనం

**పెరుగుతున్న చేరికలు :** రోజురోజుకు వైసీపీనుంచి పార్టీలో చేరికలు పెరిగిపోతున్నాయి. గ్రామ స్థాయిలో కుటుంబాలకు కుటుంబాలు టీడీపీలో చేరుతున్నాయి. ఇక, ప్రజల్లోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో వీసమంత అభివృద్ధి కనిపించకపోవడంతోపాటు బలహీనులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలు, వైసీపీ నేతల ఇసుక, క్వారీ దందాలతో వారు పూర్తిగా విసిగిపోయారు. దీంతో గ్రామాలలో టీడీపీవైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది.

### నామమాత్రంగా కాంగ్రెస్

కాంగ్రెస్‌కు ఎప్పటినుంచో పెద్ద దిక్కుగా ఉన్న డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, టీడీపీలో చేరిపోయాక అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో పూర్తిగా తీసికట్టుగా మారిపోయింది. చిన్నాచితకా నాయకులు కొందరు జిల్లా పదవులకు ఎగబాకినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. శాంతిపురం మండలానికి చెందిన ఆవుల గోపి అనే వ్యక్తికి టిక్కెట్టు ఇవ్వడంపై పార్టీలో వ్యతిరేకత పెరిగి, కుప్పంలోని పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను శ్రేణులు ధ్వంసం చేసే వరకు వెళ్లింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన పార్టీలపై ప్రభావం చూపే అవకాశం లేదు.

### వైసీపీ: విభేదాలు, అసంతృప్తులు

నామినేషన్ల ప్రక్రియ మొదలైనా వైసీపీలో విభేదాలు తగ్గలేదు. పార్టీ శ్రేణులను కలుపుకొని పోవడంలో భరత్ విఫలమయ్యారు. రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్‌కు, భరత్‌కు పొసగడంలేదన్నది బహిరంగ రహస్యం. ఎన్నికల ప్రచార పర్వంలో ఎవరికివారుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ విధిలేని పరిస్థితుల్లో సఖ్యతగా ఉంటున్నా వీరిద్దరి మధ్యనా సున్నితమైన విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఉండనే ఉంది. ఇక, తన సామాజిక వర్గానికే (వన్నెకుల క్షత్రియ) చెందిన హెచ్.ఎం.మురుగేశ్‌కు పార్టీ మండల కన్వీనర్.. ఆయన కుమార్తె అశ్విని ఎంపీపీ, కోడలు వనిత వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా పదవులు ఇప్పించారు. ఇలా, ఒకే కుటుంబానికి మూడు పదవులు ఇవ్వడంపై అదే సామాజిక వర్గ నేతల నుంచీ నిరసన వ్యక్తమవుతోంది. ఇక, భూ ఆక్రమణలు, దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి మురుగేశ్‌మీద ఆరోపణలున్నా, ఈ కుటుంబాన్నే భరత్ వెనకేసుకొస్తున్నారు. మిగిలిన మూడు మండలాల్లోనూ తన సామాజికవర్గంలోని కొందరు నాయకులనే ప్రోత్సహిస్తూ, మిగిలినవారిని నిరాశపరుస్తున్నారన్న ప్రచారం ఉంది. పైగా ఎమ్మెల్సీగా కుప్పం నియోజకవర్గానికి ఈయన చేసిందేమీ లేదు. స్థానికేతరుడు కావడంతో ఇక్కడి వారితో సంబంధాలు చాలా తక్కువ. పైగా వైసీపీ మార్క్ అయిన భూదందాలు, క్వారీ, ఇసుక దందాలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకొచ్చింది.



#### ప్రభుత్వంపై సర్పంచుల్లో ఆగ్రహం

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 89 పంచాయతీలలో ఏకంగా 74 వైసీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. ఈ పంచాయతీల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా జరగకపోగా.. నిధులనూ జగన్ ప్రభుత్వం దారి మళ్లించడం.. వలంటీర్ల వ్యవస్థతో తమ అధికారాలను నిర్వీర్యం చేయడం వంటి కారణాలతో అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా పర్వంలో ఎక్కడో తప్ప కనిపించడంలేదు.

# అట్టహాసంగా బొజ్జల సుధీర్ రెడ్డి నామినేషన్





సేవ్ శ్రీకాళహస్తి ప్లకార్డును చూపుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి - ర్యాలీలో జన సందోహం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం ఊరందూరులోని ఇంటి వద్ద వేద పండితులతో ఆశీర్వాదం పొందారు. అనంతరం తల్లి బృందమ్మకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత తండ్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సమాధి వద్ద నమస్కరించి బయలుదేరారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీలోని వినాయక ఆలయం వద్ద గణనాధునికి పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా కూటమి శ్రేణుల కోలాహలం మధ్య బయలుదేరారు. అమరజ్యోతి కల్యాణ మండపం కూడలి, బీపీ అగ్రహారం కూడలి, వెంకటగిరి బస్టాండు, రామసేతు వంతెన, సూపర్ బజారు కూడలి, నెహ్రూ వీధి, పెళ్లి మండపం కూడలి, నగిరి వీధి, బేరివారి మండపం కూడలి, బజార్ వీధి, ముక్కంటి ఆలయం వద్ద భిక్షాలగాలి గోపురం, సన్నిధి వీధి, జల వినాయక కూడలి భక్త కన్నప్ప వంతెన మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేరుకుంది. అనంతరం రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డికి బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషితా రెడ్డి వేరువేరుగా రెండు సెట్ల నామినేషన్లను సమర్పించారు. అనంతరం వెలుపలకు వచ్చిన సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, శ్రీకాళహస్తిలో 50 వేలకు పైగా భారీ మెజారిటీతో తాను విజయం సాధిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, గురవారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షు చంద్రప్ప, జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, నాయకులు ముని రాజా నాయుడు, విజయ్ కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



గౌరీ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: అనుమానాస్పద స్థితిలో గౌరీ(30) అనే వివాహిత మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధికి చెందిన అనిల్ ఎలక్ట్రానిక్ పరికరాల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఆయన భార్య గౌరీ గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాలతో భార్యాభర్తల విభేదాలు తలెత్తాయి. గౌరీ తల్లిదండ్రులు వెంకటేష్ రెడ్డి, లక్ష్మమ్మ పలుమార్లు అనిల్ దంపతులకు బుద్ధి మాటలు చెప్పి సర్దుబాటు చేశారు. బుధవారం కూడా దంపతుల మధ్య గొడవ జరగడంతో కుటుంబ సభ్యులు రాజీ చేశారు. గురువారం మధ్యాహ్నం గౌరీ ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భర్త అనిల్ గుర్తించినట్లుగా గౌరీ తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న గౌరీ బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తూ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గౌరీ మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## వైసీపీ ప్రచారంలో ముక్కంటి ఆలయ ఉద్యోగి



ఎన్నికల ప్రచారంలో ముక్కంటి ఉద్యోగి శివారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగిగా పని చేస్తున్న శివారెడ్డి వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. శ్రీకాళహస్తి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన శివారెడ్డిని అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో పది నెలల క్రితం ముక్కంటి ఆలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఒప్పంద ప్రాతిపదికన నియమించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదనరెడ్డి బుధవారం పట్టణంలోని మెట్టకండికి ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో శివారెడ్డి పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ప్రతిపక్ష నాయకులు సిద్ధమయ్యారు.

## టీడీపీ విజయం ఖాయం: ఆదిమూలం



టీడీపీలో చేరిన వారిలో ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 18: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం పిచ్చాటూరు పార్టీ కార్యాలయంలో రామగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ చైర్మన్ కేఎల్.వెంకటేశులు నాయుడుతో పాటు నాగూరు, ఆనంద్, చంద్రన్, గజేంద్ర టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటేశులు నాయుడు ఆదిమూలంను శాలువలతో సన్మానించి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ సర్పంచులు పద్దురాజు, రామకృష్ణంరాజు, నాయకులు వాసు, ఎస్సీసెల్ కార్యదర్శి నీరువాయి నాగరాజు, రమేష్, చిన్న, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

సత్యవేడు, ఏప్రిల్ 18: టీడీపీ అధినేత చంద్రబాబు సత్యవేడు పర్యటనను విజయవంతం చేయాలని తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ శనివారం చంద్రబాబు సత్యవేడులో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆదిమూలం మాట్లాడుతూ శుక్రవారం సత్యవేడులో తాను నామినే దాఖలు చేస్తానని, జయప్రదం చేయాలని కోరారు.

## నంది వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం, ఏప్రిల్ 18: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారిని నంది వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతరప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని హంస వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారధి, సూపరిటెండెంట్ ధర్మయ్య, అర్జితం అదికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

## గాజులపెళ్లూరులో వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 18: మండలంలోని గాజులపెళ్లూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దివాకర్ రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దకొట్టాయి ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం పెద్ద కొట్టాయి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పరిమళభరిత పుష్పమాలలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అక్కడి నుంచి ఆలయంలోని కోట మండపం వద్ద పగడ చెట్టు కింద సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉషోమూర్తులను కొలువుదీర్చారు. వట్టివేర్లతో చలువ వాతావరణం కల్పించారు. అనంతరం విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి తర్వాత తిరిగి ఆలయంలోని అలంకార మండపంలో కొలువుదీర్చారు. ఈ విశేష ఉత్సవాన్ని భక్తులు దర్శించుకుని ముక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలంతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డితో కలసి ప్రచారం

## శ్రీకాళహస్తిలో తొలిరోజున ఐదు నామినేషన్లు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొలిరోజున ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల కోసం గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదట ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి రెండు సెట్లు నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డికి అందజేశారు. ఆయన సతీమణి రిషితా రెడ్డి నామినేషన్ల సమర్పించారు. ఆ తర్వాత బీసీవై పార్టీకి చెందిన దినత్ బాబు నామినేషన్ వేశారు. మొత్తంగా ఐదు నామినేషన్లు నమోదయినట్లు రిటర్నింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి ప్రకటించారు.

## సత్యవేడులో రెండు నామినేషన్లు



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బాలగురవం బాబు

సత్యవేడు, ఏప్రిల్ 18: సత్యవేడు అసెంబ్లీ స్థానానికి తొలిరోజైన గురువారం రెండు నామినేషన్లు దాఖలయినట్లు రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు. వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ తరపున ఆయన సతీమణి చైతన్య భాను నామినేషన్ వేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి బాలగురవం బాబు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ స్వీకరణ సందర్భంగా నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి నంద్యాలకు చెందిన వెంకటసుబ్బయ్య రూ.లక్ష విరాళంగా అందజేశారు. గురువారం దాత కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకున్నారు. పరిపాలన భవనంలో అధికారులను కలిసి నగదు విరాళంగా సమర్పించారు. దాతను అధికారులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# చంద్రబాబు బహిరంగసభను జయప్రదం చేద్దాం

### తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

సత్యవేడు, ఏప్రిల్ 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే బహిరంగ సభను ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తిరుపతి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గురువారం సత్యవేడు టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలాన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చంద్రబాబు పర్యటన విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. వైసీపీ దుర్మార్గ పాలనపై సుదీర్ఘపోరాటం చేస్తున్న చంద్రబాబుకు అండగానిలవాల్సిన అవసరం ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌కు బుద్ధిచెప్పేలా ప్రజలను ఆయన సమాయత్తం చేస్తున్నారన్నారు. శనివారం చంద్రబాబు పుట్టిన రోజు కూడా కావడంతో ఈ బహిరంగ సభను అత్యంత భారీగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బాషా, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సుధీర్‌తో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. భారీ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## టీడీపీలో చేరికలు

రేణిగుంట, ఏప్రిల్ 18: రేణిగుంట గంగమ్మగుడి చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి టీడీపీలో చేరారు. గురువారం శ్రీకాళహస్తిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో మాజీ సర్పంచు జ్యోతినారాయణ నేతృత్వంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంజీ రాజేష్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తి:** పట్టణానికి చెందిన బుల్లితెర సీరియల్ నిర్మాత పలమాల సుధాకర్ టీడీపీలో చేరారు. గతంలో ఆయన శ్రీకాళహస్తి శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కొద్ది సంవత్సరాలుగా రాజకీయ పార్టీలకు దూరంగా తటస్థంగా వ్యవహరించారు. బుధవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

**నాగలాపురం:** కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు డాక్టర్ శేషాద్రి, ఆయన కుమారుడు శ్యామ్యువేల్ కుమార్ గురువారం టీడీపీలో చేరారు. ఆయనకు సత్యవేడు ఆదిమూలం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**నారాయణవనం:** మండలంలోని వెత్తల తడుకు పంచాయతీ సర్పంచు రామూర్తి, వార్డు మెంబర్ చిన్నబ్బతో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరన్, ఎంపీపీ గోవిందస్వామి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, నాయకులు గాండ్ల శెట్టి, షణ్ముగం పాల్గొన్నారు.

## మద్యం సీసాల స్వాధీనం

ఏర్పేడు, ఏప్రిల్ 18: ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గోవర్దన్ నుంచి 11 మద్యం సీసాలను పోలీసులు గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. గోవర్దన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు.

## మన్మోహన్ సింగ్ కృషి ఫలితమే శ్రీసిటీ: చింతా



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

సత్యవేడు, ఏప్రిల్ 18: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కృషి ఫలితమే శ్రీసిటీ ఏర్పాటు అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సత్యవేడులో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలో భాగంగా శ్రీసిటీ ఆవిర్భావించిందని ఆయన స్పష్టం చేశారు. దేశానికి మోదీ చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం చేపడుతుందని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామచంద్రారెడ్డి, శిఖామణి, చల్లదొరై, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగ:** కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ అన్నారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చల్లాదొరై తదితరులు పాల్గొన్నారు.

**నాగలాపురం:** మండలంలో స్థానిక నాయకులతో కలిసి చింతామోహన్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సింధూజా, డాక్టర్ దామోదరం పాల్గొన్నారు.

## 432 కిలోల నెయ్యి వితరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: శ్రీకాళహస్తీశ్వరాలయానికి పుత్తూరుకు చెందిన శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్స్ సంస్థ నిర్వాహకులు 432 కిలోల నెయ్యిని గురువారం వితరణగా సమర్పించారు. కార్యక్రమంలో అన్నదానం ఇన్‌చార్జి, ఏఈవో ప్రసాద్, అడ్మిషన్ సూపరింటెండెంట్ కల్యాణి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా గురు దక్షిణామూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా కలసస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణ కవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాలు మధ్య ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## కేవీకేలో శ్రీలంక అధికారులు

రేణిగుంట, ఏప్రిల్ 18: రేణిగుంట మండల పరిధిలోని చైతన్యపురం వద్ద ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని శ్రీలంక సెంట్రల్ ప్రావిన్స్ నుంచి 50 మందితో కూడిన అధికారుల బృందం గురువారం సందర్శించారు. రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను అధ్యయనం చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు విభాగాల వారీగా చేపడుతున్న వివిధ ప్రదర్శన క్షేత్రాలు శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీలంక అధికారులు డాక్టర్ తనూజ హెల్దిరాచి, మాస్టర్ ట్రైనర్లు గుల్కాదువా, సభ్యులు ఫెరీరా, సిబ్బంది పాల్గొన్నారు.



కృషి విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీలంక బృందం

# కిక్కిరిసిన నగరి

## భారీ జనసందోహంతో నామినేషన్‌కు భానుప్రకాష్




తండ్రి సమాధి వద్ద నామినేషన్ పత్రం వుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న భానుప్రకాష్ - నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తూ...

నగరి, ఏప్రిల్ 18: నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ భారీ జనసందోహంతో తరలివచ్చి నామినేషన్ వేశారు. గురువారం ఉదయం ఆయన రామచంద్రాపురం మండలంలోని తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు సమాధి వద్ద నామినేషన్ పత్రాలు వుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కొత్తపేట అగర వినాయకస్వామి దేవాలయానికి భానుప్రకాష్ రాగా వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం 9.15 గంటలకు ఆలయంలోనే నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. తరలివచ్చిన సాఫ్ట్‌వేర్లు ఆయనను శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం ర్యాలీగా టవర్‌క్లాక్ మీదుగా తహసీల్దారు కార్యాలయానికి తరలివెళ్లారు. టీడీపీ నేత ప్రతాప్‌రాజు ప్రతిపాదించగా, రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీరెడ్డితో కలిసి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. పదివేల మందికి పైగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం భానుప్రకాష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నామినేషన్ వేయడానికి ఇంత భారీ స్థాయిలో జనం తరలి వచ్చారంటే జగన్‌పై జనానికి ఎంత ఆవేశం వుందో తెలుస్తోందన్నారు. వైసీపీ లాంటి అరాచక, అక్రమ, అసమర్థత ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదని, త్వరలో జరిగే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

## పోలీసు పహారాలో చీరాలమ్మ జాతర

రేణిగుంట, ఏప్రిల్ 18: రేణిగుంట మండల పరిధిలోని కృష్ణాపురం చీరాలమ్మ జాతర పోలీసు పహారా మధ్య జరిగింది. గత ఏడాది జాతరలో ఘర్షణ జరిగిన నేపథ్యంలో గురువారం పోలీసులు పటిష్టమైన భద్రత కల్పించారు. గ్రామదేవత చీరాల కొండపై గ్రామస్తులు దున్నపోతులను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలోని నడివీధి గంగమ్మను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. సాయంత్రం గ్రామంలోని వీధుల్లో నడివీధి గంగమ్మను ఊరేగించారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18: అగ్ని ప్రమాదాల సమయంలో ఆందోళన పడకుండా ఆలోచనతో వ్యవహరించాలని శ్రీకాళహస్తి అగ్నిమాపక అధికారి నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ది స్కూల్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలను నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ అగ్ని ప్రమాదాలను అదుపు చేయడం, విద్యుదాఘాతంతో ఏర్పడే మంటలను కట్టడి చేయడం వంటి అంశాలను ప్రదర్శించి చూపారు.